తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# సుగంధపరిమళ ద్రవ్యాలతో ఆలయ శుద్ధి

## -నేడు ఆణివార ఆస్థానం, పుష్పపల్లకి



తిరుమల, జూలై 15ప్రభాతవార్తప్రతినిధి:
సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం ముందు మంగళవారం ఉదయం తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు మహాయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ జె.శ్యామలరావు ,అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు ,టిటిడి సివిఎస్‌ఓ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## చెంగల్వరాయస్వామికి

# శాస్త్రోక్తంగా అంకురార్పణ



ఆడికృత్తిక అంకుర్పారణ కార్యక్రమాల్లో వెండిపల్లకి ఊరేగింపు

శ్రీకాళహస్తి, జూలై 15 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి వార్షిక ఆడికృత్తిక మహోత్సవాల సందర్భంగా మంగళ వారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు అర్ధగిరి, ఆలయ అభిషేక ప్రధానార్చకులు స్వామి నాధన్ గురుకుల్, ఉప ప్రధానార్చకులు రామనాధ గురుకుల్, అర్చకులు ఎస్ పరశురామ్‌గురుకుల్ (అచ్చితా గురుకుల్) నిరంజన్ గురుకుల్, సురేస్ గురుకుల్స్, అర్ధగిరి ,సామవేదం శ్రీనివాసశర్మ అర్చకుల ఆధ్వర్యంలో ధ్వజారోహణ పూజా కార్య క్రమాలు కన్నుల పండువగా సాగాయి. శ్రీవల్లి దేవసేన సమేత శ్రీచెంగల్వరాయస్వామి ఉత్సవ మూర్తికి దివ్యాలంకరణ చేసి కొలువుదీర్చారు. అనంతరం కలశస్థాపన పూజలను నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణలతో చెంగల్వరాయ స్వామి ఎదురుగా అంకురార్పణ పూజలను వేద మంత్రోచ్ఛారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కలశ ఉద్వాసన చేసి చెంగల్వరాయ స్వామి మూలవిరాట్టుకు విశేషపూజలను జరిపి పూర్ణ హారతి ఇచ్చారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకట స్వామి, దఫేదార్ రాజా,శేఖర్,డిఇఇ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చివరివిడత పదవులు వరించేదెవరినో!?



## జాతకాలు పరీక్షించుకుంటున్న తెలుగుతమ్ముళ్ళు !

ప్రభాతవార్త-తిరుపతి:
టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత జిల్లాలో తెలుగుతమ్ముళ్ళు తమ జాతకాలు పరీక్షించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాలం పూర్తయిన తరువాత మిగిలిన నామినేటెడ్ పదవుల కోసం ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని పలువురు సీనియర్ నాయకులు, తెలుగుతమ్ముళ్ళు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కీలకమైన పదవులను ఐదారుమంది జిల్లావాసులకు కట్టబెట్టిన అధిష్టానం ఈ సారి చివరివిడత పదవుల పంపిణీలో మాత్రం తప్పకుండా మూడునాలుగు దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని, పార్టీకోసం కష్టపడి పనిచేస్తున్న నేతలు, కార్యకర్తలకు ఇవ్వాలనే ఆలోచనతో చంద్రబాబు,యువమంత్రి లోకేశ్ కూడా తుది నిర్ణయాంలో ఉన్నారు.ఇప్పటికే ఉమ్మడి చిత్తూరుజిల్లాకు చెందిన 14నియోజకవర్గాలకు చెందిన తెలుగుతమ్ముళ్ళు తమ హోదాకు తగ్గట్లు నామినేటెడ్ పదవులకోసం తమ బయోడేటాతో కూడిన జాబితాను అధిష్టానంకు అందజేశారు. పార్టీలో కష్టపడిన గుర్తింపుకు నామినేటెడ్‌పదవులు కట్టబెడతారని ఆశావహులైన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతలు, కార్యకర్తలు వేచిచూస్తున్నారు. ఇప్పటికే భర్తీచేసిన పలు కీలకమైన నామినేటెడ్ పదవుల్లో సొంత జిల్లాలో తిరుపతి,చిత్తూరుజిల్లాల్లో నేతలకు పదవులు ఇచ్చారు. ఇంకా కొన్ని కార్పొరేషన్‌లు, అభివృద్ధి సంఘాలకు డైరెక్టర్ పదవులు భర్తీ కావలసి వుంది. 2019-24 మధ్యకాలంలో ఉభయ చిత్తూరుజిల్లాలో టిడిపి నేతలు కొందరు వైసిపికి కోవర్టులుగా మారారనే ఆరోపణలతో ఫిర్యాదులు అధినేత వరకు చేరాయి. అయితే పార్టీని నమ్ముకున్న నేతలు చాలామంది ఉన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వీరంతా ఇప్పటికీ టిడిపిని వీడటానికి ససేమిరా అంటున్నారు. అయితే ఈ దఫా పార్టీకి విశ్వాసంగా ఉన్న నాయకులు, కార్యకర్తలను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలనే ఆలోచనతో పార్టీ ఉంది. చివరివిడతలో పదవులు కట్టబెట్టకపోతే పరిస్థితి దారుణంగా ఉంటుందనే సంకేతాలు వినిపిస్తున్నాయి. గత ఐదేళ్ళలో పార్టీని వీడిన నేతలు లేకపోలేదు. పార్టీపై విసిగి ,అధినేత తీరుతో అలిగిన నేతలను బుజ్జగించే వారే లేకపోయారు. అతికష్టంమీద ఇప్పుడు అధికారంలో ఉన్నప్పటికీ తమకు ఆదరణ ఉంటుందనే విశ్వాసం కొందరు సీనియర్లు వెలిబుస్తున్నారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకోసం కష్టపడి ప్రజలకు చేరువై 13చోట్ల ఎమ్మెల్యేలను గెలిపించడంలో కార్యకర్తలు ,కొందరు నేతల పనితీరు ఎంతైనా ఉంది. తమకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ,ప్రజాసేవకు మరింతగా కష్టపడి పనిచేస్తామని యువత, పార్టీలో సీనియర్ నాయకులు తమ జాబితాను ఏకంగా అధినేతకే అందజేశారు. ఉమ్మడి జిల్లాలో తిరుపతి నేతలు రాష్ట్ర కార్యదర్శులు సూరాసుధాకర్‌రెడ్డి, పుష్పావతియాదవ్, బి.శ్రీధర్‌వర్మ, కంకణాల రజనీకాంత్‌నాయుడు,బుల్లెట్‌రమణ, మబ్బుదేవ నారాయణరెడ్డి,దంపూరి భాస్కర్‌యాదవ్ , చంద్రగిరి నుండి ఇద్దరు బలమైన నాయకులు, చిత్తూరు నుండి ఇద్దరు నేతలు, శ్రీకాళహస్తి నుండి ఇద్దరు నేతలు, నగరి నుండి ఇద్దరు నేతలు, సత్యవేడు నుంచి ఇద్దరు నేతలు, పూతలపట్టునుండి ఇద్దరు నేతలు, గూడూరు,జిడినెల్లూరు నియోజకవర్గం నుండి కొందరు నేతలు పదవులు వస్తాయని ఆశిస్తున్నారు. మరీ ఈనెలాఖరులో అందరి భవితవ్యం తెలిపోనుంది.

# బడి విలీన ప్రక్రియను విరమించుకోవాలి

## - రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు



చిల్లకూరు, జూలై 15, ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వం బడుల విలీన ప్రక్రియ తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. చిల్లకూరు మండల పరిధిలోని తూర్పు కనుపూరు పంచాయతీ కేంద్రంలో ఒకటి నుండి 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలను మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమరవారిపాలెంలో ఏర్పాటు చేయడంతో గిరిజన విద్యార్థులు పాఠశాలల వెళ్లకుండా చదువుకు దూరమై గ్రామంలో వెలసి ఉన్న శ్రీశ్రీ ముత్యాలమ్మ ఆలయంలో భిక్షాటన చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందరికి విద్య కల్పించే విధంగా ఒక వైపు నిర్ణయం తీసుకుంటూ మరోవైపు బడుల విలీన ప్రక్రియ పేరుతో దళితులు గిరిజనులకు చదువుకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా గిరిజన కుటుంబాలు తమ బిడ్డలను చదివించుకోవడమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో పంచాయతీ కేంద్రంలో ఉన్న పాఠశాలను ఎత్తివేసి ఆ పంచాయతీ పరిధిలోని మూడు కిలోమీటర్ల ఉన్న కొమరవారిపాలెంలో ఏర్పాటు చేయడం భావ్యంగా లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీ కేంద్రమైన తూర్పు కనుమూరు గ్రామంలో ఒకటి నుండి 5వ తరగతి వరకు ఉన్న పాఠశాలను కొనసాగించాలని ఆయన కోరారు. పాఠశాలను తూర్పు కనుమూరులో తిరిగి ఏర్పాటు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# పారిశుధ్యంపై కమీషనర్లు ప్రత్యేక శ్రద్ధ

## బాధ్యతగా టౌన్ ప్లానింగ్ అధికారులు విధులు: కలెక్టర్



చిత్తూరు, జులై 15 ప్రభాతవార్త:
మున్సిపల్ నగరాలు, పట్టణాల్లో ప్రతి రోజు ఉదయం సమయాల్లో పారిశుధ్యంపై మున్సిపల్ కమీషనర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని మున్సిపాల్టీల వ్యయ, ఆదాయలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాల్టీల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని కమీషనర్లను ఆదేశించారు. అలాగే మున్సిపాల్టీల పరిధిలోని ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందించాల్సిన బాధ్యత కమీషనర్లకు వుందన్నారు. మున్సిపాల్టీల నుండి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా త్వరలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఆ సమయంలో మంచి నీటి పైపులైన్లు ఎక్కడా లీకేజీ జరుగకుండా చూడాలన్నారు. అలాగే ప్రతి పది రోజులకు ఒకసారి ఓవర్ హెడ్ ట్యాంకులు క్లోరిన్‌తో శుభ్రం చేయాలని, డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా జ్వరాలు ప్రబలకుండా ముందస్తు ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. అలాగే మున్సిపాల్టీల్లో నాణ్యమైన విద్యుత్ దీపాలు అమర్చాలని కమీషనర్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలోని మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

## వినాయకసాగర్‌ను

# సుందరంగా తయారుచేస్తాం

## స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్, కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జులై 15 ప్రభాతవార్త:
నగరపాలక సంస్థ పరిధిలోని వినాయకసాగర్‌లో 3.30 కోట్ల రూపాయలతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ రఘు వంశీ, డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణ మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2021లో స్మార్ట్ సిటీ మిషన్ లో భాగంగా స్విమ్మింగ్ పూల్ నిర్మాణంతో పాటు 17.95 లక్షలతో టాయిలెట్స్‌ను నిర్మించగా అవి మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చాయని అన్నారు. వాకర్స్ కోసం ఆప్కాస్ సంస్థ రెండు వేల లీటర్ల సామర్థంతో ఆర్వో ప్లాంటను ప్రారంభించామన్నారు. వినాయక సాగర్‌ను సర్వాంగసుందరంగా తయారు చేస్తామని అన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ వినాయకసాగర్‌లో అధునాతనంగా నిర్మించిన స్విమ్మింగ్ పూల్ తిరుపతి వాసులకు అందుబాటులోకి తెచ్చామని అన్నారు. చిల్డ్రన్, అడల్ట్ పూల్ ఏరియాలు వేరు వేరుగా ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. 25 కి 21మీటర్ల పొడవు, ఆరు అడుగుల లోతు నుంచి 15 అడుగుల లోతుతో అధునాతన ఫిల్టరేషన్ తో స్విమ్మింగ్ పూల్ నిర్మించినట్లు ఆయన తెలిపారు. 20 రోజుల్లో స్విమ్మింగ్ పూల్ నిర్వహణ టెండర్ పిలవడంతో పాటు ప్రొఫెసనల్ కోచ్ ల ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో అనేక అభివృద్ధి పనులు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణ, రాధా రెడ్డి, అనిల్ కుమార్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జి.ఎం. చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈ.ఈ.రవి, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంటికో పారిశ్రామికవేత్త సిఎం చంద్రబాబు ఆశయం

## - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్




కుప్పం, జూలై 15 ప్రభాతవార్త
ఇంటికో పారిశ్రామికవేత్త తయారుకావాలనేది సిఎం చంద్రబాబు నాయుడు ఆశయమని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పి.డి. వికాస్ మర్మత్ పేర్కొన్నారు. మంగళవారం కడ కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామి కవేత్తలకు శిక్షణ కార్యక్రమంను ఎపిస్కిల్‌డెవలప్‌మెంట్ కార్పోరేషన్, కడ అధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలో నూతన పరిశ్రమలు వస్తున్నాయన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. స్థానికంగా ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కూడా తమకు నచ్చిన చిన్న,మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుచేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బ్యాంకర్లు కూడా ఔత్సాహికులకు రుణాలు అందించాలని బ్యాంకుల చుట్టూ సిబిల్ స్కోర్ లేదని తిప్పించుకోరాదని సూచించారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలో ఉన్న మానవ వనరులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక వెసులుబాటు కల్పించే పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని సూచించారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈసందర్భంగా పరిశ్రమల ఏర్పాటు, రుణాలు, మార్కెటింగ్ సౌకర్యం, ప్రభుత్వ పథకాలు, రాయితీలు వంటి వాటిపై కూలంకుషంగా వివరించారు. మరలా శిక్షణ అవసరం ఉంటే చిత్తూరు లేదా పూణే నగరాలకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో కడ సభ్యులు డా॥ బిఆర్ సురేష్‌బాబు, రాజ్‌కుమార్, రామచంద్ర, సతీష్, సుగుణమ్మ, వెంకటేష్, రఘు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపండి

## ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



పుత్తూరు (నగరి), జూలై 15 ప్రభాతవార్త :
నగరి నియోజకవర్గంలో బియ్యం, గ్రావెల్, గంజాయి, ఇసుక అక్రమ రవాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ఆదేశించారు. మంగళవారం అన్ని మండలాల తహశీల్దార్లు, పోలీస్ అధికారులతో ఆయన నగరిలోని ఆర్డిఒ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో నియోజకవర్గంలో గ్రావెల్, ఇసుక, బియ్యం స్మగ్లింగ్ జరుగుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. స్మగ్లింగ్‌ను అరికట్టడంలో అధికారులకు తాను పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నానని తెలిపారు. అందువల్ల అక్రమ రవాణా చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు.ప్రజలెవరైనా ఇంటి నిర్మాణం, మరమ్మతులకు కోసం ఇసుక తీసుకెళ్లేటపుడు ఇబ్బంది పెట్టొద్దన్నారు. అలాగే రెండు రోజుల క్రితం అంతరాష్ట్ర ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని కేసులు పెట్టిన పోలీస్ అధికారులను ఆయన అభినందించారు.నగరి, పుత్తూరు డిఎస్పీలు కూడా పాల్గొన్నారు.



తిరుమల తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులతో కలిసి భోజనం చేసిన చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు
ప్రభాతవార్త-తిరుపతి:




## డొనేషన్ల దాతలను పట్టించుకునే దిక్కులేదు

# దళారుల దందాకు అంతులేదు

## శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో మాయాజాలం . .

**శ్రీకాళహస్తీశ్వరాలయంలో దాతలకు గుర్తింపు లేదు. లక్షలకు లక్షలు విరాళాలు అందించే దాతలకు గుర్తింపు లేదు. ఒక నాడు ఆలయానికి ధూప,దీప నైవేద్యాలు అందించిన దాతలకు 1994 వరకు ట్రస్టుబోర్డులో అవకాశం కల్పించే వారు.కానీ ప్రస్తుతం ఆ విధానాలకు ప్రభుత్వమే స్వస్తి చెప్పింది.శ్రీకాళహస్తీశ్వరాలయానికి నిత్యాన్నదాన పథకానికి విరాళాలు వెల్లువగా అందిస్తున్నారు. అయితే ఇక్కడి ఆలయానికి భూరి విరాళాలు అందించిన వారు తరువాత దర్శనానికి వచ్చే వారిని పట్టించుకునే దిక్కులేదు. కనీసం పలకరించే వారు లేక ఇబ్బందులుఎదుర్కొంటున్నారు.కనీసం స్వామివారి దర్శనానికి కూడా సిఫార్సు లేక దాతలు తీవ్ర మనోవేదనకు గురౌతున్నారు. విరాళాలు ఇచ్చినపుడు మాత్రం అరచేతిలో స్వర్గం చూపతున్నారు. మరి ప్రోటోకాల్ అధికారులు ఎందుకు స్పందించటం లేదనేది ఆశ్చర్యకరం**

శ్రీకాళహస్తి,జూలై 15 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు పెద్ద పారిశ్రామిక వేత్తలు ధాతృత్వం కల్గిన వారు శివయ్య మీద భక్తి శ్రద్ధలతో విరాళాలను అందిస్తున్నారు. ఇలా నేడు ఆలయానికి శివయ్య ఖాతాలో సుమారు 200కోట్లు నిధులు సమకూర్చాయి. లెక్కలేనంత బంగారు,వెండి ఉన్నాయి.అయితే ఇక్కడ దాతలకు గుర్తింపు లేదనే అసంతృప్తి చోటు చేసుకుంది. రాష్ట్రంలోని ఇతర దేవాలయాలు, ముఖ్యంగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమలేశుని సన్నిధిలో డోనర్స్‌కు ఒక రోజు బసకు గది,దర్శనాలను ఉచితంగా ఏర్పాటు చేసారు. వీరికి ప్రోటోకాల్ దర్శనం ఏర్పాటు చేసారు. నేడు తిరుమలేశునికి లక్షల్లో భక్తులు వస్తున్నారు. అయినా డోనర్స్‌కు గుర్తింపు ఇస్తున్నారు.కానీ శ్రీకాళహస్తిలోని వాయులింగేశ్వరుని సన్నిధికి విరాళలు ఇచ్చే వారు మళ్ళీ ఎప్పుడైనా వస్తే వారిని గురించి పట్టించుకునే దిక్కే లేదు. వారు కార్యాలయంలో బతిమలాడి బతిమలాడి చివరకు దళారుల ద్వారా దర్శనాలకు వెళ్ళె దుర్భర పరిస్థితి చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని రెన్యూవేషన్ చేసిన నాటుకోటు చెట్టియార్లు కుటుంబానికి చెందిన వారు శివరాత్రికి వస్తే పట్టించుకునే దిక్కులేదు. అంతేకాక ఎవరైనా దాతలు డోనేషన్ ఇవ్వటానికి వస్తే ఽకూడా ఎక్కడ ఇవ్వాలో తెలియని స్థితి చోటు చేసుకుంది. గతంలో ఆలయంలో భూరి విరాళాలు ఇచ్చేవారిని రాజపోషకులు,మహారాజపోషకులు, అంటూ గ్రేడ్ గా విభజించి వారికి సదుపాయాలు కల్పించుటకు భరోసా ఇస్తున్నారు. పేరు గొప్ప ఊరుదిబ్బ అంటూ మారింది. ఇక్కడ డోనర్స్ ఛాంబర్,ఆఫీస్,కౌంటర్లు ఏర్పాటు చేసారు.కానీ ఇక్కడ ఆదరించే దిక్కు ఉండరు. పిఆర్ఓను అడుగుదామనుకుంటే ఆయన తనకు సంబంధం లేదంటారు. మరి ఎవరిని సంప్రదించాలో దిక్కుతోచని స్తితి చోటు చేసుకుంది. డోనర్స్‌ను ఆదరించి 'సుదర్శనం,ప్రత్యేక గుర్తింపు ఇస్తే వారు మరి కొందరికి ప్రచారం చేస్తారు.ఈ విధానం లేకపోవటంతో డోనర్స్ మనో వేదనకు గురౌతున్నారు. అయితే గత కొంత కాలంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాబడి తప్ప గుర్తింపు లేకుండా పోయింది, దళారులకు ఉన్నంత ప్రాధాన్యత నిజమైన దాతలకు ఇవ్వటం లేదు. ఇందుకు పాలకులు,అధికారులు దాతల దర్శనాలు, బస సదుపాయాలకుప్రత్యేకంగా ఓ అధికారిని నియమిస్తే బాగుంటుందని భావిస్తున్నారు.

## నేతల చొరవతో పాఠశాల ప్రాంగణం బాగు

కుప్పంరూరల్, జూలై 15 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి కొత్తపేట ఫిషర్‌మెన్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం తెదేపా నేతల చొరవతో బాగుపడింది. మాజీ ఎంపిటిసి కృష్ణన్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్‌ల నేతృత్వంలో జెసిబి, ట్రాక్టర్లు పెట్టి పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ సభ్యుడు డా॥ బిఆర్ సురేష్‌బాబుల సహకారంతో వాటి పరిష్కారంకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డికెపల్లి మణి, నేతలు నబీ, వేలు, ఆర్ముగం పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో విద్యుత్ రంగాన్ని భ్రష్టు పట్టించారు

- మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, జూలై 15 ప్రభాతవార్త

వైకాపా పాలనలో విద్యుత్ రంగాన్ని భ్రష్టు పట్టించారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం శాంతిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచేది లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారన్నారు. గత వైకాపా పాలనలో విద్యుత్ శాఖపై 1.3లక్షల కోట్ల భారాన్ని మోపారన్నారు. ఒక్క మెగావాట్ విద్యుత్ కూడా ఉత్పత్తి చేయలేదన్నారు. రాయలసీమ ప్రాంతం గ్రీన్ ఎనర్జీకి అనువైన ప్రాంతం అని కూటమి ప్రభుత్వం ఇందుకు తగిన చర్యలు చేపడుతోందన్నారు. ప్రజలు పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయానికి తొమ్మిదిగంటలు, గృహాలు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు చెప్పారు.

## ఎయిర్‌పోర్టు భూసేకరణకు 2013 చట్టాన్ని పాటించాలి

- రైతు సంఘ జిల్లా కార్యదర్శి ఓబుల్‌రాజు

శాంతిపురం, జూలై 15 ప్రభాతవార్త



కుప్పం ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు సంబంధించి 2013 భూసేకరణ చట్టాన్ని పాటించాలని జిల్లా వ్యవసాయ కార్మిక, రైతు సంఘం కార్యదర్శి ఓబుల్‌రాజు పేర్కొన్నారు. మంగళవారం శాంతిపురంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నోటిఫికేషన్ ఇచ్చిన పదిహేను రోజుల్లో భూములు ఇవ్వాలని బెదిరింపు ధోరణిలో అధికారులు వ్యవహరించడం తగదన్నారు. రైతులనుంచి బలవంతంగా భూములు తీసుకునే యత్నం చేస్తే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. వ్యవసాయ కూలీలకు 2013 చట్ట ప్రకారం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత ప్రాంతంలో 3500మంది కూలీలు ఉన్నారన్నారు. ప్రతి వ్యక్తికి నెలకు ఐదువేల భృతి, కుటుంబానికి ఐదు లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో చట్టాన్ని వందశాతం అమలు చేయాలన్నారు. రైతులఅంగీకారంతోనే భూములు తీసుకోవాలన్నారు. సమావేశంలో మాజీ రెస్కో ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, రైతులు పలువురు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి రూ.2.20 లక్షలు జరిమానా

**చిత్తూరు, జులై 15 ప్రభాతవార్త:** చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 22 మంది వాహనదారులు ఒకొక్కరికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి 10 వేల రూపాయలు చొప్పున 2.20 లక్షల రూపాయలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు తెలిపారు. చిత్తూరు నగర పరిధిలో సోమవారం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు 22 మంది వాహనదారులు పట్టుబడ్డారని, వీరిని మంగళ వారం న్యాయస్థానం ఎదుట హాజరు పరిస్తే జడ్జి ఉమాదేవి ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున 2.20 లక్షల రూపాయలు జరిమానా విధించడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఏడు నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 1,658 మంది వాహనదారులుపట్టుబడ్డారని,వారినుండి1.65కోట్లరూపాయలుజరిమానావసూలుచేయడం జరిగిందన్నారు.

## క్లినికల్ సేస్ స్టడీలతో వైద్య నైపుణ్యాభివృద్ధి

- అపోలో క్లినికల్ మీటింగ్



**చిత్తూరు, జులై 15 ప్రభాతవార్త:** చిత్తూరు అపోలో వైద్య విజ్ఞాన, పరిశోధన సంస్థ(ఎఐఎంఎస్ఆర్)లో మంగళవారం క్లినికల్ సమావేశం నిర్వహించారు. లెక్చర్ హాల్-2లో జరిగిన ఈ సెషన్‌లో ఫ్యాకల్టీ సభ్యులు, హౌస్ సర్జన్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మూడు ముఖ్యమైన క్లినికల్ కేసులపై లోతైన చర్చ జరిగింది. క్లినికల్ కేస్ స్టడీలు, చికిత్స విధానాలపై విశ్లేషణాత్మక చర్చ ఈ సమావేశంలో నిర్వహించారు. ప్రాక్టికల్ అవగాహన పెంపొందించుకోవడానికి ఇలాంటి సెషన్లు ఉపయోగపడుతాయని అధ్యాపకులు పేర్కొన్నారు. పిజీ విద్యార్థులు డాక్టర్ సంయుక్త, డాక్టర్ సాహితీ, డాక్టర్ టి.శైలజ, డాక్టర్ పూజిత రంగాలు క్లినికల్ కేసులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు నిర్వహించారు. వీటిపై ఫిజియాలజీ విభాగం హెడ్ డాక్టర్ రమ్య, గైనకాలజీ విభాగం హెడ్ డాక్టర్ బి.మంజులత, ప్రొఫెసర్ డాక్టర్ టి.శేషసాయి, జనరల్ మెడిసన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎస్ శ్రీధర్, క్లినికల్ మీటింగ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.రాజేష్‌కుమార్‌లు ముఖ్య సూచనలు చేశారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వాస్తవిక ఉదాహరణలతో కూడిన చర్చలు బావితర వైద్యుల నైపుణ్యాభివృద్ధికి బలమైన పునాది వేస్తాయని ఫ్యాకల్టీ సభ్యులు అభిప్రాయపడ్డారు.

## గ్రావెల్ అక్రమ రవాణాకు పాల్పడితే సహించేది లేదు

- ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్



**పాలసముద్రం, జులై 15 ప్రభాతవార్త:** జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలో అక్రమ గ్రావెల్ రవాణాను సహించేది లేదని ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ స్పష్టం చేశారు. పాలసముద్రం మండలంలో అక్రమ గ్రావెల్ రవాణా జరుగుతుందని తనకు సమాచారం అందడంతో తాను అధికారులను ఆదేశించడంతో మంగళవారం ఒక్కరోజు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ఏడు వాహనాలను అధికారులు పట్టుకుని సీజ్ చేశారన్నారు. కొంతమంది అక్రమ గ్రావెల్ వ్యాపారులు తన పేరు చెప్పుకుని లాభం పొందాలని చూస్తున్నారని, తాను ప్రజలకు సేవ చేయడానికి మాత్రమే రాజకీయాల్లోకి వచ్చానని అక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోను ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు.

## పక్కాగా పారిశుధ్యం

పాలసముద్రం, జులై 15 ప్రభాతవార్త:



వర్షాకాలంలో వ్యాధులు ప్రబల కుండా క్షేత్ర స్థాయిలో పక్కాగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపిడిఓ సతీష్‌కుమార్ ఆదేశం చారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భా గంగా మంగళవారం ఉదయం ఎంపిడిఓ సతీష్‌కుమార్, డిప్యూటీ ఎంపిడిఓ సత్యనారా యణలు పంచాయతీలో గ్రీన్ అంబాసిడార్ల పనితీరు, శానిటేషన్, క్లోరినేషన్ పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో వీధి లైట్లు, డ్రైనేజీ, తడి, పొడి చెత్త సేకరణ తదితరాలను పక్కాగా నిర్వహించి వనదుర్గాపురం పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల దేశం ప్రదాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు సుబ్రమణ్యంమండడి, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, సర్పంచ్ వరదరాజులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మామ మరణానికి కారకురాలైన కోడలికి రిమాండ్

చౌడేపల్లి, జూలై 15 ప్రభాతవార్త



మామ మరణానికి కారకురాలైన కోడలిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు...మండలంలోని ఎ.కొత్తకోట పంచాయతీ అంకుతోటపల్లికి చెందిన చినపరెడ్డిపై మార్చి 30న అతని కుమారుడు మనోహర్‌రెడ్డి, కోడలు సరస్వతమ్మలు దాడి చేసి తీవ్రంగా గాయపరచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసారు. అప్పటి నుంచి అసుపత్రిలో వున్న చినపరెడ్డి ఏప్రిల్ 9న ఇంటికి వచ్చాడు. తీవ్ర మనోవేదనకు గురైన ఆయన ఏప్రిల్ 21న మరణించాడు. ఆ కేసులో పరారీలో వున్న కోడలిని అదుపులోకి తీసుకొని పుంగనూరు న్యాయస్థానంలో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఇప్పటికే మనోహర్‌రెడ్డిని అరెస్టు చేశారు.

## ఘనంగా పీర్ల ఊరేగింపు

చౌడేపల్లి, జూలై 15 ప్రభాతవార్త



మండల కేంద్రమైన చౌడేపల్లిలో ముస్లిం సోదరులు పీర్లను ఘనంగా ఊరేగించారు. మొహరం పండుగను పురష్కరించుకొని స్థానిక గాంధీవీధిలోగల పీర్ల మఠం నుంచి పట్టణంలోని వివిధ వీధులగుండా ఊరేగించి అందరూ సుభిక్షింగా వుండాలని ధూపం వేశారు. హిందూ-ముస్లిం సఖ్యత కోరుతూ ఇంటింటికీ తిరిగి ప్రవక్తను గురించి వివరించారు.

## బహిరంగ వేలం పాటల ద్వారా 81.25 లక్షలు ఆదాయం

కాణిపాకం, జూలై 15 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో వివిధ లీజు హక్కుల కోసం మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటల ద్వారా 81.25 లోలు ఆదాయం లభించింది. స్థానిక ఈఓ కార్యాలయంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో వివిధ లీజు హక్కుల కోసం బహిరంగ వేలం పాటలను నిర్వహించారు. ఈసందర్భంగా ఏడాది కాల పరిమితితో తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కు లీజు కోసం నిర్వహించిన వేలం పాటల ద్వారా 71 లక్షలు, కళ్యాణ కట్ట ఎదురుగా బంకు నిర్వహజంచుకునే లీజు హక్కు ద్వారా 5,00,200 రూపాయలు, శివాలయం పార్క్,, ఆలయ పరిసరాల్లో ఫోటోలు తీసుకునే లైసెన్స్ హక్కు లీజు ద్వారా 5,25 లక్షలు రూపాయలు ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు.ఈవేలం పాటల్లో డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ, ఏఈఓలు ప్రసాద్, దనపాల్, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అరగొండ సింగిల్ విండో ఛైర్మన్‌గా రంజిత్‌రెడ్డి నియామకం

తవణంపల్లె, జూలై 15 ప్రభాతవార్త:



మండలంలోని అరగొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) ఛైర్మన్‌గా ఎ.రంజిత్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలోని పలు సింగిల్ విండోల పాలకవర్గంలను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్వర్వులు జారీ చేసింది. ఈమేరకు అరగొండ సింగిల్ విండో ఛైర్మన్‌గా మండల టీడీపీ నాయకులు ఎ.రంజిత్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర సహకారశాఖ కమీషనర్ ఉత్వర్వులు జారీ చేశారు. అలాగే డైరక్టర్‌లుగా ఎ.విజయ్‌కుమార్, వెంకటేష్‌లను నియమిస్తూ ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. నూతన పాలక వర్గం ఛైర్మన్ రంజిత్‌రెడ్డి, డైరక్టర్‌లను మండల టీడీపీ నాయకులు పైమాఘం ఎ.రఘుపతి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా రంజిత్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సింగిల్ విండో అభివృద్దికి, రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## 26న ద్రావిడ స్నేహ దినోత్సవం

కుప్పం, జూలై 15 ప్రభాతవార్త

ద్రావిడ సిటీ మూమెంట్స్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో ఈనెల 26వతేది కుప్పంలో ద్రావిడ స్నేహ దినోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి దర్శన్ తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 12గంటలకు ఈకార్యక్రమం కుప్పం రైల్వే స్టేషన్ నుంచి మొదలై ద్రవిడ వర్సిటీ వరకు చేరుతుందన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 9492133984,9686177118నెంబర్లను సంప్రదించాలని కోరారు. తెలుగు,తమిళం, కన్నడ, మళయాళ భాషలు మాట్లాడుకునే ప్రజలందరూ కలుసుకునేందుకు సరైన చోటు ద్రవిడ వర్సిటీ అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## ఘనంగా శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర

కుప్పం, జూలై 15 ప్రభాతవార్త



భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా మంగళవారం శ్రీ సత్యసా యి సేవా సమితి అధ్వర్యంలో కుప్పం నియో జకవర్గంలో శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర కార్యక్రమంను ఘనంగా నిర్వ హించారు. కుప్పం పట్టణంలో ఈ సంద ర్భంగా బాబా వారి రథాన్ని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ సందర్శించారు. కార్య క్రమంలో సత్యసాయిసేవా సమితి జిల్లా అధ్యక్షుడు మధుసూధన్, కుప్పం కన్వీనర్ నాగేంద్రకుమార్, ఇతర భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి..సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- తెదేపా రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు

కుప్పం, జూలై 15 ప్రభాతవార్త



రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. మంగళ వారం మున్సిపల్ పరిధి జల్లప్పకొ టాలు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. 16342పోస్టులతో మెగా డిఎస్సీ, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, దీపం2 పథకాలు ఇలా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వైకాపా పాలనలో గాడి తప్పిన పాలనను మరలా గాడిన పెడుతూ రాష్ట్రాన్ని ప్రగతివైపు తీసుకెళ్తున్నారన్నారు. కుప్పాన్ని వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసేందుకు సిఎం చర్యలు చేపట్టారన్నారు. ప్రజలు కూడా తమకు ఎవరు మేలు కలిగించారో గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కన్నన్, సోమశేఖర్, కడ సభ్యుడు సతీష్, నేతలు బిఎంకె రవిచంద్రబాబు, కదిరప్ప, వెంకటరమణ, రాజారాం, బాలాజీ, మల్లి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

## తూతూ మంత్రంగా సాగిన సర్వసభ సమావేశం

పూతలపట్టు, జూలై 15, ప్రభాతవార్త



అభివృద్ధి పనులు సమస్యలపై తూతూ మంత్రంగా జరిగింది మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశం భవనంలో ఎంపీపీ కుమారి అధ్యక్షతనను సాధారణ సర్వసభ సమావేశం ఎంపీడీవో నాగరాజు నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు 13 మంది ఉండగా ఐదు మంది హాజరయ్యారు సర్పంచులు 25 మంది ఉండగా పదిమంది హాజరయ్యారు. ఫోరం లేకుండా సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. తాసిల్దార్ రమేష్ బాబు మాట్లాడుతూ అన్న క్యాంటీన్ ఈ ఎస్ హాస్పిటల్ స్థలం కేటాయించారు. మండలం ప్రజలు సమస్యలపై పరిష్కారం మార్గంలో పనిచేయాలని తెలిపారు అమర్ రాజా కంపెనీ సిబ్బంది మాట్లాడుతూ అమర్ రాజా కంపెనీలో ఉద్యోగలు ఉన్నాయన్నారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హతలు టెన్త్ పాస్ ఇంటర్మీడియట్ ఐటిఐలు మగవారికి మాత్రమే అవకాశం అన్నారు. జీతం 14 వేల 500 రూపాయలు పనివేళ ఎనిమిది గంటలు మూడు చిట్లు కలవు వయసు 18 సంవత్సరాలు పైన 30 సంవత్సరాల లోపు ఉండాలి ఇంటర్వ్యూలు ప్రతి సోమవారం ఉదయం 9 గంటలకు బంగారు పాల్యం హైవే వర్గంలో ఉన్న అమర్ రాజా కంపెనీకి రావాలన్నారు, ఈ సమావేశంలో ఎంపీటీసీలు సర్పంచులు పంచాయతీ సెక్రటరీలు పిఓపిఆర్డి శ్రీనివాసులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం శాఖ సంధ్యారాణి, ఏపిఎం సింగన్న, వ్యవసాయ శాఖ అధికారి మధురవాణి, పశు వైద్య శాఖ దీపా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ఆశయం

కల్లూరు, జూలై 15, ప్రభాతవార్త



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ఆశయమని టిడిపి నా యకులు కుమార్ రెడ్డి, బండ్ల రమేష్ అన్నారు. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం 102 ఈ రామి రెడ్డి గారి పల్లి పంచాయతీ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కుమార్ రెడ్డి. బండ్ల రమేష్ గత సంవత్సరంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు వివరించి కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు.

## ప్రజలందరి సంక్షేమమే టిడిపి లక్ష్యం

- ఎమ్మెల్యే పులివర్తి నాని



యర్రావారిపాలెం, జూలై 15, ప్రభాతవార్త

రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సుపరిపాలన తొలి అడుగులో భాగంగా మంగళవారం ఉస్తికాయలపెంట పంచాయతీలో ప్రారంభించారు. ఎమ్మెల్యే పులివర్తి నానికి మహిళలు హారతులతో స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తూ ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అన్ని నెరవేరుస్తానని ఆయన అన్నారు. మండలంలో సుమారు 70 శాతం సమస్యలను పరిష్కరించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మదన్మోహన్ రాజు, ఎమ్మార్వో పరమేశ్వర స్వామి, ఎస్సై బాలకృష్ణ, మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, పార్లమెంటు కార్యదర్శి అన్న సముద్రం మధు, యూత్ ప్రెసిడెంట్ నిరంజన్, చిత్తూరు పార్లమెంట్ కన్వీనర్ మల్లారి దేవి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఉపాధ్యక్షురాలు శివరాణి, మండల ఏస్టి సెల్ అధ్యక్షుడు కుంభ నాగరాజ, రైతు కార్యదర్శి ప్రసాద్ నాయుడు, సోషల్ మీడియా కోడినేటర్ చిన్నప రెడ్డి, తలకోన బోర్డ్ ఛైర్మన్ సోమనాథ్ రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ హరిప్రసాద్ బాధ్యతల స్వీకరణ

పుంగనూరు, జూలై 15, ప్రభాతవార్త

పట్టణ పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా హరిప్రసాద్ మంగళవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు విఆర్‌లో ఉన్న హరి ప్రసాద్‌ను జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా స్టేషన్‌లో సీఏ సుబ్బారాయుడు ఆయనకు స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రముఖులు హరిప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

## బెంగళూరు నుంచి బస్సు పునరుద్ధరించండి

పుంగనూరు రూరల్, జూలై 15 ప్రభాతవార్త



బెంగళూరు నుంచి పుంగనూరుకు నడిచే ఆర్టీసీ బస్సు సేవలను తిరిగి ప్రారంభించాలని బీజేపీ నేతలు ఆర్టీసీ అధికారులను కోరారు. గతంలో ప్రతి రోజు ఉదయం 5 గంటలకు బెంగళూరులో బయలుదేరే బస్సు, ఉదయం 9 గంటల సమయంలో పుంగనూరుకు చేరేది. బెంగళూరులో ఉద్యోగాలు, వాణిజ్య కార్యకలాపాల నిమిత్తం నిత్యం వెళ్తున్న ప్రజలకు ఈ బస్సు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే ఇటీవల ఈ సేవను నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ డిపో మేనేజర్ పావని ని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నరసింహులు, పార్టీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు అయూబ్ అలీ ఖాన్ కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ బస్సు సేవను తిరిగి ప్రారంభించాలని వారు కోరారు.

## సదరన్ స్లాట్ ద్వారా సేవలు

పుంగనూరు రూరల్, జూలై 15 ప్రభాతవార్త

పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళ వారం సదరన్ క్యాంపు జరిగింది. ఈ క్యాంపులో సదరన్ స్లాట్‌లో బుక్ చేసుకున్న రోగులకు సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ ఆర్థో డాక్టర్ మధుమోహన్ ప్రత్యేక వైద్య సేవలు అందించారు. రోగుల రిపోర్టులు పరిశీలించి అవసరమైన చికిత్సలు సూచించారు. క్యాంపును ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరగోపాల్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఫిజీషియన్‌గా డాక్టర్ హబీబ్ అలీ నియమితులైనట్లు తెలిపారు.



## 17 నుంచి పాలిసెట్ చివరి దశ కౌన్సిలింగ్

**తిరుపతి విద్య, జూలై 15 ప్రభాత వార్త** ఏపీ పాలిసెట్ 2025 కు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియకు కౌన్సిలింగ్ చివరి దశ ఈనెల 17 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కౌన్సిలింగ్ కోఆర్డినేటర్, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వై ద్వారకనాథ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ప్రాసెసింగ్ ఫీజు చెల్లించని అభ్యర్థులు 19 లోపు చెల్లించి సర్టిఫికేట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.అలాగే లేటరల్ ఎంట్రీ,బ్రిడ్జ్ కోర్సు పూర్తి చేసిన ఐటీఐ అభ్యర్థులు డిప్లొమో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం కొరకు ఈనెల 17 వ తేదీలోపు ధరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.ఈనెల 19 వతేదీ ఉదయం 10 గంటలకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ నందు ఒరిజినల్ ధృవపత్రాలతో కౌన్సిలింగ్ కు హాజరు కావాలని కోరారు.సీటు సాధించిన అభ్యర్థులు రూ.6 వేలు ఫీజు చెల్లించి అడ్మిషన్లు పొందాలని సూచించారు.

## రేపు గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు కౌన్సిలింగ్

**తిరుపతి విద్య, జూలై 15 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బిఆర్ అంబే ద్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్లకు గురు వారం కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ జిల్లా సమన్వయకర్త టి పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు.ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్న ఆసక్తిగల విద్యార్థులు గురువారం ఉదయం 10గంటలకు చిత్తూరులోని ఏపీఎస్ఈడబ్ల్యూఐ సొసైటీ (పుత్తూరు రోడ్డులోని ఎంప్లాయిమెంట్ ఆఫీసు దగ్గర) కార్యాలయంలో జరగనున్న కౌన్సిలింగ్ కు హాజరు కావాలని సూచించారు.

## వడమాలపేట, కాయం సింగిల్‌విండోలకు అధ్యక్షుల నియామకం

**వడమాలపేట, జూలై 15 ప్రభాతవార్త:** వడమాలపేట మండలంలోని వడమాలపేట, కాయం సింగిల్ విండోలకు ఛైర్మన్, సభ్యులను ప్రభుత్వం నూతనంగా నియమించింది. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రతిపాదన మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీసీసీబీ ఛైర్మన్‌గా అమాస రాజశేఖర్‌రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన నేపథ్యంలో భాగంగా కాయం సింగిల్‌విండో ఛైర్మన్‌గా ఆయన ఎంపికయ్యారు. అలాగే వడమాలపేట సింగిల్‌విండో ఛైర్మన్‌గా వడమాలకు చెందిన డి.భూపేంద్ర ప్రసాద్(కుమార్), సభ్యులుగా టీసీ అగ్రహారంకు చెందిన వెంకటరమణ,బట్టికండ్రిగకు చెందిన పొన్నయ్‌రాజులు ఎంపికయ్యారు.

## శాంతిపురానికి మలివిడత 130 గోకులం షెడ్లు మంజూరు



**శాంతిపురం, జూలై 15 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం శాంతిపురం మండలానికి మలివిడతలో 130 గోకులం షెడ్లు మంజూరు చేసిందని ఎ ఒపిడిఒ పిఆర్‌కుమార్ తెలిపారు. 3కోట్లతో వీటిని నిర్మించనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో 126 షెడ్లు మంజూరు కాగా వాటిలో నిర్మాణాలు పూర్తయిన వాటికి 1.10కోట్ల బిల్లులు చెల్లించామన్నారు. అనంతరం అబకలదొడ్డి దామలచెరువు వద్ద జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన తనిఖీ చేసి కూలీలకు రోజుకు మూడు వందల కూలీ గిట్టుబాటు అయ్యేలా పనులు చేపట్టాలని ఎఫ్ఎలను ఆదేశించారు.

## గుండిశెట్టిపల్లిలో సుపరిపాలనలో తొలిఅడుగు



**శాంతిపురం, జూలై 15 ప్రభాతవార్త** మండలంలోని గుండిశెట్టిపల్లి గ్రామంలో మంగళవారం తెదేపా నేతలు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాలు పంచారు. యూనిట్ ఇన్‌చార్జ్ బాలు, అనిల్, వేదశ్రీ, డా॥ ఉమాపతి, భాస్కర్ పాల్గొన్నారు.

## ఆస్తుల విషయంగా న్యాయం చేయాలని ఆవేదన



**శాంతిపురం, జూలై 15 ప్రభాతవార్త** తన తాత ఆస్తి విషయంగా తనకు న్యాయం చేయాలని మండలంలోని ఎస్. గొల్లపల్లికి చెందిన మునిరత్నం ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు చిన్నారొడిద్దీ గ్రామం రెవెన్యూ సర్వే నెం 22-21లో 1.99 సెంట్ల భూమి ఉందని అయితే అందుకు సంబంధించిన పాసు పుస్తకాలు దారిపోయాయన్నారు. ఈవిషయంగా రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు విఆర్వోకు ఫిర్యాదు చేసినానని అయితే మూడు నెలలుగా తనను తిప్పిస్తున్నారని వాపోయాడు. తన చిన్నాన్న భాగ పరిష్కారం చేస్తానని తమ కుటుంబాన్ని మోసం చేశాడని తన భార్య బంగారం సైతం తాకట్టు పెట్టించి ఇంతవరకు తీసి ఇవ్వలేదన్నారు. పంచాయతీ పెడితే తన కుటుంబీకులపై దాడికి దిగాడని ఈవిషయంగా అధికారులు తనకు న్యాయం చేయాలని కోరాడు.

## చిన్న దుకాణాలపై కఠిన నిబంధనలు



**పూతలపట్టు, జూలై 15, ప్రభాతవార్త** ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు, యువతను పొగాకు వల్ల వచ్చే ముప్పు నుంచి రక్షించేందుకు కాట్పా - 2003 చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్న ప్రభుత్వం, చిన్న దుకాణాల యజమానులకు పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కీలక సూచనలు జారీ చేసారు. ఈ సందర్భంగా ఎస్వి సెట్ సమీపంలో పలు షాపులు తనిఖీ చేసిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల చుట్టూ 100 మీటర్ల పరిధిలో, బస్టాండ్‌లు, హాస్పిటల్‌ల వద్ద సిగరెట్లు, బీడీలు, గుట్కా, హాన్స్ లాంటి పొగాకు ఉత్పత్తుల విక్రయంపై నిషేధం విధించారు అని తెలిపారు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని పూతలపట్టు సీఐ ఈ సందర్భంగా తెలిపారు.

## మహతిలో జరిగే బుద్ధునితో నా ప్రయాణం నాటక ప్రదర్శనకు రారండి

- పలువురు ప్రముఖులకు స్టార్ కృష్ణ ఆహ్వానం

**రేణిగుంట, జూలై 15 ప్రభాతవార్త :** ఈనెల 19వ తేదిన ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో జరిగే బుద్ధునితో నా ప్రయాణం నాటకం ప్రదర్శనకు ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ, తిరుపతి అంబేద్కర్ భవన్ ఛైర్మన్ పరమశివన్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్ట్ అధికారి ఎం. జగదీష్‌ను కలిసి విశిష్ట అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. అలాగే ఈ కార్యక్రమానికి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని నాటికను విజయవంతం చేయాలని స్టార్ కృష్ణ, పరమశివన్ పిలుపునిచ్చారు. టాక్స్ మాజీ ఆఫీసర్ మొగిలప్ప, మాజీ బ్యాంకు మేనేజర్ గోపాలకృష్ణ, భవన్ ట్రెజరర్ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యూలో ముగిసిన బ్రిడ్జి కోర్సు



**తిరుపతి విద్య, జులై 15 ప్రభాతవార్త** జాతీయ సంస్కృత వర్సిటీలో పీజీ కోర్సులలో ప్రవేశం పొందిన నూతన విద్యార్థులకు గత వారం రోజులుగా నిర్వహించిన బ్రిడ్జి కోర్సు మంగళవారం ముగిసింది. వర్సిటీలోని చెలికాని అన్నారావు భవన్లో జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ విచ్చేసి మాట్లాడుతూ సంస్కృతంలోని 14 శాస్త్రీయ అంశాలపై విద్యార్థులకు వారం రోజుల పాటు పరిచయాత్మక బోధన ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థులు వర్సిటీలోని సదుపాయాలను వినియోగించుకుని ఉన్నత స్థాయి చేరుకుని వర్సిటీకి పేరుప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. అనంతరం బ్రిడ్జికోర్సుకు హాజరైన విద్యార్థులకు ప్రమాణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాకరణ విభాగం అధ్యక్షులు ప్రొఫెసర్ పంకజ్ కుమార్ వ్యాస్, డాక్టర్ యశస్వీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వం అనే అంశంపై న్యాయవాదులకు అవగాహన

శ్రీకాళహస్తి, జులై 15 ప్రభాతవార్త



రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో మంగళవారం 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ న్యాయవాదులకు అవగాహన సదస్సును నిర్వహించారు. జడ్జి ఆదేశాలతో అవగాహన స్టాల్‌ను ఏర్పాటు చేసారు. దేశంకోసం మధ్యవర్తిత్వం అనే నినాదాలతో అవగాహనర్యాలిని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల నుద్దేశించి శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వానికి అర్హమైన అంశాలలో వివాహ వివాదాలు, ప్రమాద క్లైయిములు, గృహ హింస, చెక్ బౌన్స్ కేసులు, వాణిజ్య వివాదాలు, సర్వీస్‌కేసులు, క్రిమినల్ కాంపౌండులు కేసులు, వినియోగారుల వివాదాలు, రుణరికవరి కేసులు, విభజన తొలగింపు కేసులు భూసేకరణ విషయాలు ఉన్నాయి. దేశం కోసం మధ్యవర్తిత్వం ప్రచారం జరుగుతోందన్నారు. ఇది పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి సామరస్యపూర్వక పరిష్కారాల ద్వారా జరుగుతందన్నారు. జాతీయ న్యాయ సేవల అథారిటి మరియు సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వం మరియు సయోధ్య ప్రాజెక్టు కమిటి నేతృత్వంలో ఈ ప్రచారం, వ్యాజ్యానికి ప్రత్యామ్నాయంగా మధ్యవర్తిత్వం ఎంచుకునేలా పార్టీలను ప్రోత్సహించటం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రచారం అన్ని తాలుకా, జిల్లా కోర్టుల్లో తగిన కేసులను గుర్తించటం పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం కేంద్రాలను పంపడంపై దృష్టి పెడుతుందని శ్రీనివాస్‌నాయక్ వివరించారు.

## 17న ఫుడ్ ప్రాసెసింగ్‌సెంటర్ ప్రారంభం

శ్రీకాళహస్తి, జులై 15 ప్రభాతవార్త

తిరుపతి ఐఐటిలో ఈ నెల 13న ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ ప్రారభం అనివార్యకారణాలతో వాయిదా పడిన విషయం విదితమే. ఈ ప్రారంభోత్సవాన్ని ఈ నెల 17న ఏర్పాటు చేసినట్లు ఐఐటి డైరెక్టర్ ప్రొ. ఎస్సత్యనారాయణ మంగళశారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ హాజరౌతారని వివరించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉదయం 10.30గంటలకు కార్యక్రమాలు ప్రారంభమౌతాయని డైరెక్టర్ వివరించారు.

## భక్తులకు మరుగుదొడ్ల మాటేమిటి?

శ్రీకాళహస్తి, జులై 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ధర్మరాజుల స్వామి ఆలయం విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి, దుర్గమ్మకొండ, ముత్యాలమ్మ ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 19 నుంచి కుమారస్వామి కొండపై భారీ ఎత్తున ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేలాది మంది భక్తులు హాజరయ్యే ఈ ఉత్సవాలకు కొండమీదకే కాకుండా నారదపుష్కరిణిలో స్నానమాచరించటానికి భక్తులు వేలాది మంది కదలి వస్తారు. అయితే ఇక్కడ మరుగుదొడ్ల సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇక్కడకు వచ్చే భక్తులు బిపి. షుగర్ ఇతర ఆరోగ్య సమస్యలతో సతమతమౌతున్నారని హిందూధార్మిక మండలి కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు ఆరోపించారు. ఇందుకు గతంలో మున్సిపాలిటి పాత నెల్లూరుబస్టాండు మలుపు వద్ద మూతవేసిన మరుగుదొడ్లను బాగు చేయాలని కోరారు.

## అటు విద్యాలయాలు.. ఇటు పరిశ్రమలతో అభివృద్ధి

శ్రీకాళహస్తి రూరల్, జులై 15 ప్రభాతవార్త



ఏర్పేడు మండలాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించేది ఒక్క తెలుగుదేశం పార్టీయే అని అది కూడా బొజ్జల కుటుంబానికే సాధ్యమని మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజానాయుడు అన్నారు. సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా మంగళవారం ఏర్పేడు మండలంలోని నచ్చనేరి దుర్గిపేరిలో పర్యటించి ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరిస్తూ ప్రజలు ఇంకా ఏం కోరుకుంటున్నారనేది తెలుసుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకులు ప్రజలకు సన్నిహితంగా ఉండాలనే లక్ష్యంతో నెల రోజుల కార్యక్రమాలను ఏర్పాటు చేసారన్నారు. ఏర్పేడు మండలంలోని దుర్గిపేరి నచ్చనేరి సమీపంలో కేంద్ర విద్యాసంస్థలు ఐఐటి, ఐసర్‌లను ఏర్పాటు చేసి ఈ ప్రాంతాలకు గుర్తింపు తెచ్చారన్నారు. నేడు బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రతి గ్రామంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించుటకు పరిశ్రమలను స్థాపించుటకు పారిశ్రామిక వెత్తలను ఆహ్వానిస్తున్నారని ఇదో పారిశ్రామిక హబ్‌గా తీర్చి దిద్దుటకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని నాగరాజునాయుడు వివరించారు. ఈ కార్యక్రమాల్లో నాగరాజునాయుడుతో పాటు రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి, పున్నారావు, మోహన్‌నాయుడు, శివశంకర్‌రెడ్డి, సూరి నాయుడు, బాబునాయుడు, రవినాయుడు మురగయ్య, గుణా యాదవ్, రాచేటి సుబ్రమణ్యం, మహేష్‌రెడ్డి, మునెయ్య, పార్థసారధి. హరి, రాఘవేంద్ర, ఎన్ సుబ్రమణ్యం రెడ్డి, సుబ్రమణ్యం, మునిరెడ్డి, రామచంద్రరెడ్డి టి. గురవయ్య, జయచంద్రారెడ్డి, తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నారాయణ పాఠశాలలో వన మహోత్సవం

తిరుపతి విద్య, జులై 15 ప్రభాతవార్త



స్థానిక న్యూ ఇందిరానగర్‌లో గల నారాయణ జోనల్ ఆఫీస్‌లో మంగళవారం మన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రకృతి మరియు సుందరీకరణ చైర్మన్ మన్నూరు సుగుణమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చెట్లను జ్ఞాపకం వలన పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని ప్రకృతి రమణీయతను కాపాడే బాధ్యత విద్యార్థుల చేతిలో ఉందని ప్రతి ఒక్క విద్యార్థి తన పుట్టినరోజు నాడు ఒక మొక్కను నాటాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజిఎం కొండలరావు, ఏజీఎం శ్రీనివాసలు, ఆర్ ఐ వసంత్, ప్రిన్సిపాల్ హిమజా, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ హర్ష వర్దిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు

తొట్టంబేడు, జులై 15 ప్రభాతవార్త



గిరిజనుల అభివృద్ధికి కాలనీల అభివృద్ధికి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పక్కా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని శివనాథ్‌పాళెం గిరిజన కాలనీలో తొలిఅడుగు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తొలిఅడుగు కార్యక్రమాల్లో ఇక్కడకు వచ్చిన నాయకులు పర్యటించారు. గిరిజనులు ప్రతి ఒక్కరు తమ బిడ్డలను చదివించాలన్నారు. గిరిజనుల పిల్లలకు చదివించుకొనుటకు గిరిజన గురుకులాలను ఏర్పాటు చేసారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త పథకాలకు సంబంధించి ఇంటింటికి వెళ్ళి వివరించారు. సమస్యలను వివరిస్తూ ముందుకు వెళ్ళారు. ఈ కార్యక్రమాల్లో మునిరాజానాయుడుతో పాటు మహేష్, మధు, వెంకట్రామయ్య, సుప్రియ, మనోహర్, ఆర్ముగం, మధు, లెక్కల మురళినాయుడు, రామానాయుడు, కమల్, భాస్కర్, కనపర్తి శంకర్, నాయడు, గున్నయ్య, బోనుపల్లి రాజేంద్ర, బాలాజిరెడ్డి, ప్రతాప్, శివకుమార్‌రెడ్డి ఖాదర్, వెంకటయ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆ కళాశాల గుర్తింపును రద్దు చేయండి.

తిరుపతి విద్య, జులై 15 ప్రభాతవార్త:



ఎస్వీయూ పరిధిలో నడుస్తున్న కేకేసీ విద్యా సంస్థ గుర్తింపును రద్దు చేయాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్, బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తిరుమలేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వీసీ అప్పారావును, రిజిస్ట్రార్ భూపతినాయుడును కలసి వినతి ప్రతం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేకేసీ సంస్థల యాజమాన్యం ప్రభుత్వాన్ని మోసం చేస్తూ అనధికారికంగా ఒకే భవనంలో ఎంబీఏ, ఎంసీఏ, లా కోర్సులు నడుపుతోందన్నారు. అలాగే అదే బిల్డింగ్లో ఎన్టీఆర్ యూనివర్సిటీకి సంబంధించినటువంటి కోర్సులు అనధికారకంగా నడుపుతూ విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించకుండా లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో వీసీ స్వయంగా కళాశాలను తనిఖీ చేసిన సందర్భంలో ఆ కళాశాల అవినీతి బయటపడిందన్నారు. విద్యార్థులకు సరైన సౌకర్యాలు, ల్యాబ్లు, అర్హత గల బోధన సిబ్బంది లేకుండా, విద్యా ప్రమాణాలను తుంగలో తొక్కి వ్యాపార కేంద్రంగా మార్చిన కేకేసీ విద్యాసంస్థ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టూడెంట్స్ జేఏసీ తిరుపతి నగర అధ్యక్షులు వెంకటేష్, ఎస్వీయూ అధ్యక్షులు ఉపేంద్ర, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

– మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



**పుత్తూరు రూరల్, జులై 15 ప్రభాతవార్త:** పుత్తూరు మండల పరిధిలోని పరమేశ్వర మంగళం సమీపంలో రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన మరో వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా... చెన్నైకి వెళుతున్న మినీ లారీ, ముందుగా ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో దిగువ కనకంపాళెం గ్రామానికి చెందిన టి. అవనాక్షయ్య(55) అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ఆగకపోయిన లారీ అతి వేగంగా హోటల్ ముందు నిలిపి ఉంచిన రెండు కార్లను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న రాజు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలపాలైన రాజును చికిత్స నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## నేడు కేవీబీ పురం మండలంలో ఎమ్మెల్యే పర్యటన

**కేవీబీ పురం, జులై 15 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కేవీబీ పురం మండలంలో పర్యటించనున్నారని టీడీపీ నాయకులు తెలిపారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు కేవీబీ పురం మండలంలోని పెరిందేశం పంచాయతీలో 5 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డు, నీటి తొట్టె ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే ఇంటి పట్టాల పంపిణీ, శ్రీ బాలాజీ ఆస్పత్రి రేణిగుంట వారి సౌజన్యంతో జరిగే ఆరోగ్య శిబిరం కార్యక్రమానికి, స్థానిక పాఠశాలలో పిల్లారి ఫౌండేషన్ వారి సహకారంతో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాల పంపిణీ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరవుతున్నట్లు తెలిపారు.

## బ్రాహ్మణుల సంక్షేమమే ప్రధాన అజెండా

రేణిగుంట, జులై 15 ప్రభాతవార్త



బ్రాహ్మణుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని బ్రాహ్మణ సంక్షేమ శాఖ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్. రెడ్డి ప్రకాష్ అన్నారు. రేణిగుంట పాత చెక్పోస్ట్ వద్ద మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ శాఖ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నూతనంగా నియమింపబడిన రెడ్డి ప్రకాష్ కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ సమక్షంలో లారీ ట్రాన్స్‌పోర్ట్ అధినేతలు, రేణిగుంట బ్రాహ్మణ సేవా సంఘం సంయుక్తంగా ఘనం సత్కారం జరిగింది. రెడ్డి ప్రకాష్ మాట్లాడుతూ పదవి తనకు అలంకారం కాదని బాధ్యతను పెంచిందన్నారు. నిరంతరం బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉంటానన్నారు. బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. బ్రాహ్మణులంతా పుట్టినరోజు జరుపుకుంటున్న గణపతి రాయల్‌ను ఘనంగా సత్కరించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో రేణిగుంట బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు రామ్మోహన్, కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి శివకుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అశోక్ కుమార్, దీవన్, శ్రీకుమార్, ఉమాదేవి, పంకజమ్మ, రాజ్యలక్ష్మి, వివిధ ట్రాన్స్‌పోర్ట్ ల యజమానులు రాము, మురుగ, లక్ష్మీనారాయణ, రమణ రాయల్, రాజా రాయల్, శివ, గురు మోహన్, చక్రి, విజయ్, నిశాంత్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలసిన టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి

సత్యవేడు, జులై 15 ప్రభాతవార్త:



సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా నియమితులైన శంకర్‌రెడ్డి అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కలసి పార్టీ బలోపేతం అభివృద్ధిపనులు సంబంధించిన పలు అంశాలను చర్చించినట్టు తెలిసింది. ప్రధానంగా అధ్వా నంగా మారిన టీపీ కోట-వెంకటరాజుల కండ్రిగ రోడ్డు, టీపీ పాళెం-పాండూరు, సత్యవేడు-కడూరు మార్గాల్లో కొత్తగా రోడ్లు వేయడానికి అవసరమైన నిధులు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు శంకర్‌రెడ్డి వినతి అందించారు.

## దివ్యఖుర్‌ఆన్ ఆకళింపు అల్లాహ్ వరం

తొట్టంబేడు. జులై 15 ప్రభాతవార్త



దివ్యఖుర్ ఆన్‌ను పఠించటం కంఠస్థం చేయటం అనేది అల్లాహ్ ఇచ్చిన వరం అని పలువురు మత గురువులు అన్నారు. మంగళవారం తొట్టంబేడు మండలం రామచంద్రాపురంలోని మద్రసాలో 13 సంవత్సరాల బాలుడు రెండు సంవత్సరాల్లో దివ్యఖుర్‌ఆన్‌ను కంఠస్థం చేసారు. ఆయన్ను హాఫీజే ఖుర్ అన్ అంటారు. ఆయనను పరిక్షించుటకు శ్రీకాళహస్తి నుంచి కడపజిల్లా రాయచోటి నుంచి మత గురువులు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ధృవీకరణ పత్రం సమర్పించే కార్యక్రమాలకు నిర్వాహకులు హాఫీజే ఖుర్ ఆన్ నసీం అఖ్తర్ అధ్యక్షత వహించారు. మూడు సంవత్సరాల ముందు ఏర్పడిన మద్రాసాను అందరు ఆదరించారన్నారు. అందరి సహకారంలో దివ్యఖుర్ ఆన్ పఠనం కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా హాఫీజే ఖుర్ అన్ రేహాన్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పట్టణంలో 15 మసీదులున్నాయని కొన్ని చోట్ల సంప్రదాయ విద్యను అభ్యసించుటకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అంతేకాక దివ్యఖుర్‌ఆన్ పఠనాన్ని ప్రతి ఒక్కరు చేపట్టాలని అల్లాహ్ ఆదేశించారన్నారు. చిన్న వయస్సులో దివ్యఖుర్‌ఆన్‌ను కంఠస్థం చేసి అప్పగించిన శ్రీకాళహస్తికి చెందిన విద్యార్థి సయ్యద్ ఫైరోజ్‌ను అభినందించారు. మరో ముఖ్యఅతిథిగా కడపజిల్లా రాయచోటికి చెందిన మౌలానా సఫీఉల్లా, శ్రీకాళహస్తికి చెందిన మహమ్మద్ అలి, జసీముద్దీన్, హాఫీజ్ పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్బగా ఖుర్‌ఆన్‌ను హిఫ్జ చేసినవిద్యార్థిని ఆశీర్వదించి సర్టిఫికేట్‌ను అందించారు.

## పారిశుద్ధ్యానికి పెద్దపీట:నిధుల కోసం వేట

శ్రీకాళహస్తి, జులై 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని మున్సిపాలిటిలో పారిశుధ్ధ్యానికి పెద్ద పీట వేస్తున్నామని అభివృద్ధికి వేటలో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పరుగులు తీస్తున్నారని పట్టణ పార్టీ అధ్యక్షుడు జి. విజయ కుమార్ అన్నారు. మంగళవారం 30 వార్డులోని సర్దార్‌వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలలో ఇంటింటికి సంక్షేమ పథకాల అందజేత కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ శాసనసభ్యుడుగా సుధీర్‌రెడ్డి గెలిచిన వెంటనే పట్టణంలోని ప్రధాన మురుగునీటి కాలువలో పేరుకుపోయిన సిల్టును తొలగించుటకు ప్రత్యేకంగా రూ. 57లక్షలు నిధులు సాధించి పనులు చేయించారన్నారు. మరో సారి కాలువలో సిల్టు తొలగింపజేసారన్నారు. ప్రతి రోజూ వార్డుల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో విజయకుమార్‌తోపాటు క్లస్టర్ ఇన్‌చార్జి కంఠా రమేష్, వార్డు ఇన్‌చార్జి దేవిమోహన్, కాసరం రమేష్, ఆర్ముగం, పోలూరు శ్రీనివాసులు రెడ్డి, రాకేష్, హిమత్, వెంకటరమణా, దొరబాబు, సిద్దులయ్య, భాస్కర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## ముక్కంటి ఆలయం దళారుల నిలయంగా మారింది

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి రవి

**శ్రీకాళహస్తి, జులై 15 ప్రభాతవార్త** ముక్కంటి ఆలయం దళారుల నిలయంగా మారిందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి కత్తి రవి శివమెత్తారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళారీ వ్యవస్థను ఆరికడుతున్నామని ఆలయ ఉన్నతాధికారుల ప్రకటనలు ఉత్తుత్తివే అన్నారు. ఆలయంలో రోజు రోజుకు దళారీ వ్యవస్థ పెచ్చుపెరిగిపోతున్నాయని సంబంధం లేని వ్యక్తులు ఇక్కడ రెగ్యూలర్ ఉద్యోగులను శాసించే పరిస్థితి నెలకొందన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైట్‌కాలర్ వ్యవస్థ సాగుతుందని ధ్వజమెత్తారు. అంతా కట్టడి చేసామని చెబుతున్న పాలనలో ఒకసారి ఆలయంలో సాగుతున్న దందాను చూడాలని సూచించారు. సుదూర ప్రాంతాలనుంచి దర్శనం కోసం వచ్చే భక్తులను రోడ్డులో అడ్డగించుకొని మోసగిస్తున్నారని ధ్వజమెత్తారు. దైవ దర్శనం పేరుతో దళారీ వ్యవస్థ పెరగటం వలను ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారన్నారు. ఆలయ పవిత్రతను మంట కలుపుతున్నారన్నారు. ఈ దళారుల వెనుక ఎవరు హస్తం ఉన్నదో అధికారులు నిగ్గుతేల్చాలన్నారు. ఇక దళారుల వల్ల సామాన్యభక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రవి వివరించారు.

## ఎన్‌టి ఆర్ నగర్‌లో పోలీసుల పల్లె నిద్ర

తొట్టంబేడు. జులై 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఎ న్‌టిఆర్‌నగర్‌లో మంగళవారం రాత్రి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాలను నిర్వహించారు. పోలీసు వన్‌టౌన్ సిఐ గోపి సారధ్యంలో ఏర్పాటు చేసిన పల్లెనిద్రలో డిఎస్‌పి ఎన్ఎస్‌మూర్తి పాల్గొని వివిధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని చిన్న చిన్న విషయాలకు ఆవేశాలకు లోను కాకుండా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యలుంటే పోలీసులకు ఆశ్రయించాలన్నారు. ఈ పల్లెనిద్రలో ఎన్‌టిఆర్ నగర్‌వాసులు డియస్‌పికి వివరించారు. బుధవారం నుంచి ఎన్‌టిఆర్ నగర్‌లో పోలీసు పెట్రోలింగ్ పెంచి ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా చేస్తామన్నారు. ఇటీవల కాలంలో ప్రజలు సైబర్ నేరాలను ఎదుర్కొంటున్నారని ఈ మేరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమాల్లో నెమళ్ళూరు బుజ్జి మోదూరు శివకుమార్, పసుపులేటి శంకరయ్య, పూల శేఖర్, మునిబాబు, లోకేస్, కోటయ్య, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వేదాంతపురం టిడిపి అధ్యక్షుడుగా పరంధామ యాదవ్

తిరుపతిరూరల్, జులై 15 ప్రభాతవార్త:



వేదాంతపురం గ్రామ పంచాయతీ టిడిపి అధ్యక్షుడుగా చెఱుకుల్ పరంధామ యాదవ్ నియమితుల య్యారు. తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీలో మంగళవారం తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీని ప్రకటించారు. నూతన అధ్యక్షుడు పరంధామ మాట్లాడుతూ టిడిపి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా తనను నియమించిన ఎమ్మెల్యే పులివర్తి నానికి, మండల అధ్యక్షుడు ఈశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేసారు. టిడిపి గ్రామ అధ్యక్షుడుగా సి. పరంధా మయ్య, ఉపాధ్యక్షుడు ఎం. శ్యామ్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా తోట చిరంజీవి, సంయుక్త కార్యధర్శులుగా రవిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సి. వెంకటేష్, కార్యధర్శులుగా రఘురామిరెడ్డి, కుమారస్వామి, సాయికుమార్, జయచంద్ర, కోశాధికారిగా జయచంద్రలను నియమించారు. అలాగే తెలుగు యువత కమిటీని ఎంపిక చేసారు. అధ్యక్షులుగా ఎం. నవీన్, ప్రధాన కార్యధర్శిగా ఇ. శివ ప్రసాద్‌ను ఎన్నుకోగా తెలుగు మహిళ అధ్యక్షరాలుగా కె. లక్ష్మీదేవి, ప్రధాన కార్యధర్శిగా కె. జ్యోతిని ఎన్నుకున్నారు. తెలుగు రైతు విభాగానికి సంబంధించి అధ్యక్షుడుగా కె. తిరుపాల్‌రెడ్డి, ప్రధాన కార్యధర్శిగా వెంకటరమణ, బి.సి సెల్ అధ్యక్షుడుగా చెఱుకుల డిల్లీ, ప్రధాన కార్యధర్శిగా సి. మునిరామయ్య. ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా ఎం. బాబు, ప్రధాన కార్యధర్శిగా ఎం. సుందరమ్మ, ఐటిడిపి అధ్యక్షుడుగా కోండయ్య, ప్రధాన కార్యధర్శిగా మాధవ శంకర్ ఎన్నుకున్నారు.

## అవిలాల బిజెపి కార్యవర్గం ఎంపిక

–అవిలాల బిజెపి అధ్యక్షుడుగా ఈశ్వర్

తిరుపతిరూరల్, జులై 15 ప్రభాతవార్త:



అవిలాల బిజెపి అధ్యక్షుడుగా డి. ఈశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతిరూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీ బిజెపి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎంపిక చేసారు. అధ్యక్షుడుగా డి. ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా టి. మునిరాజ, జె. వర లక్ష్మీ, ఎ. రఘు, గౌతమ్, జి. గీత, ప్రచార కార్యధర్శులుగా ఎం. రెడ్డిబాబు, సి. హరీశ్వర్, కార్యధర్శులుగా ఆర్. మురళీమోహన్, జె. శ్రీహరి, కె. జ్యోతి, వి. నాగేశ్వరరెడ్డి, కోశాధికారిగా బి. నాగార్జునలను ఎంపిక చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి తిరుపతి జిల్లా కార్యధర్శి డాక్టర్ నరేష్, మహిళా నేత గాలి పుష్పలత, శ్రీధర్ పిళై తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల అధ్యక్షుడుగా "కాకిమాను మునిరాజు"

చంద్రగిరి, జులై 15 ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడుగా కాకిమాను మునిరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల ఇన్‌చార్జ్ టిడి వరప్రసాద్ తెలిపారు. స్థానిక బైపాస్ వద్ద గల ఓ ప్రైవేటు హోటల్ నందు మంగళవారం బిజెపి మండల అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని క్రియాశీలక సభ్యులు, పోలింగ్ బూత్ సభ్యులు హాజరై మండల అధ్యక్షుడుగా చంద్రగిరి కొత్తపేటకు చెందిన కాకిమాను మునిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులుకు, పార్టీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వెంకటముని, జిల్లా మాజీ అధ్యక్షుడు సుబ్రమణ్యం యాదవ్, సీనియర్ నాయకుడు మునిగంగిరెడ్డి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ సునీల్ యాదవ్, జిల్లా మహిళామోర్చా ప్రధాన కార్యదర్శి లక్ష్మమ్మ, సంగీతం దొరస్వామి, పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించడంలో భాగస్వాములుకండి

డిఈఓ కెవిఎన్ కుమార్



**చంద్రగిరి, జులై 15 ప్రభాతవార్త:** పది పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డిఈఓ కెవిఎన్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధాయయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల నమోదు పెంచాలనీ, వారి ప్రగతి నివేదికలను తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. అదేవిధంగా విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించడంపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతాప్రమాణాలను పెంచాలనీ, పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. గత ఏడాది పది ఫలితాలను అధిగమిస్తూ వచ్చే ఏడాది ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, హెచ్ఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్షయ రహిత మండలంగా చంద్రగిరి

చంద్రగిరి, జులై 15 ప్రభాతవార్త:



క్షయ రహిత మండలంగా చంద్రగిరి మండలాన్ని తీర్చిదిద్దాలని కొటాల పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి. రాజ్‌కుమార్ అన్నారు. "ఇంటెన్సిఫైడ్ టిబి ముక్త్ భారత్ అభియాన్" వంద రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం బి. కొంగం వారిపల్లిలో క్షయ వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించగలిగితే నయం చేయవచ్చన్నారు. టిబి అంటు వ్యాధి కావడం వలన తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా 60 ఏళ్ళపై బడిన వారు మద్యం, పొగత్రాగడం వంటి వాటికి దూరంగా వుండాలన్నారు. ఇటువంటి అలవాట్లు కలిగిన వారు ప్రభుత్వ ఆసుపత్రులలో గళ్ళ పరీక్షలు చేసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి సూపర్‌వైజర్ రమణ, ఎస్. వెంకటమ్మ, సిహెచ్ఓ బి. లక్ష్మి, సర్పంచ్ గిరనాయుడు, ఎస్. చంద్రబాబు, కమార్ చౌదరి, ఎంఎల్‌హెచ్‌పి జి. సౌమ్య, పి. సౌజన్య, హెచ్ఎ మేల్ ఎం. గంగయ్య, ఎం. శారద, పి. రేణుక, 104 సిబ్బంది ఎస్. సాధిక్, యు. దీప, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిరాడంబరంగా "పులికంటి మోహన్ రెడ్డి" జన్మదిన వేడుకలు

**చంద్రగిరి, జులై 15 ప్రభాతవార్త:**



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తొండవాడకు చెందిన పులికంటి మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం అభిమానులు, కార్యకర్తలతో కలసి నిరాడంబరంగా జరుపుకున్నారు. తెలుగుదేశం పార్టీలో చురుకైన నాయకుడిగా వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి విశేష సేవలందిస్తూ పంచాయతీలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తన 55వ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి నిరాడంబరంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోటీతత్వం ఉండాలి

వడమాలపేట, జులై 15 ప్రభాతవార్త:



విద్యార్థులకు పోటీతత్వం ఉన్నప్పుడే గొప్పగా రాణించగలుగుతారని ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి. పురుషోత్తమ రెడ్డి తెలిపారు. జైలై 11 తేదీ ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వారి సూచనల మేరకు వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు జనాభా పెరుగుదల వల్ల కలిగే లాభ నష్టాలపై వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు పురుషోత్తమరెడ్డి విద్యార్థులకు ఉపయోగపడే మంచి పుస్తకాలను బహుమతులుగా అందించారు. ప్రధానోపాధ్యాయులు కరుణ నవనీతం, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తులు గడువు పొడిగింపు

విజయపురం, జులై 15 ప్రభాతవార్త:

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, విజయపురంలో సీట్ల భర్తీకి రెండవ విడత దరఖాస్తులకు గడువు ఈ నెల 20 వరకు పొడిగించారని కళాశాల ప్రిన్సిపాల్ కె. భైరవుడు ఒక ప్రకటనలో తెలిపారు. జులై 20 తేదీ సాయంత్రం 5 గంటల లోపే నేరుగా కళాశాలలో కాని, ఆన్‌లైన్‌లో దరఖాస్తును సమర్పించాలని, అలాగే 23న విజయపురం ఐటీఐలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని తెలియజేశారు.

## విజయపురం ఎస్ఐగా మహేష్‌బాబు



**విజయపురం, జులై 15 ప్రభాతవార్త:** విజయపురం ఎస్ఐగా మహేష్‌బాబు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిత్తూరు ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. విజయపురంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రంగా వీఆర్‌కు పంపినట్టు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడుతానని, ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. అనంతరం మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, పలువురు టీడీపీ నాయకులు పలువురు ఎస్ఐను శాలువతో సత్కరించారు.

# బాలకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయం



కోట, జులై 15 ప్రభాతవార్త: పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విద్యార్థులకు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం 90వ జ్యోతి డే ని పురస్కరించుకుని కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో బాలకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థలు స్థాపించిన రోజును జ్యోతి డే ప్రతి సంవత్సరం జూలై 15వ తేదీన జరుపుకుంటున్నట్లు తెలిపారు. పూరిగుడిసెలో రాత్రి పాఠశాలతో ప్రారంభమై అంచ లంచెలుగా ఎదిగి కళాశాలలుగా జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు నిలబడ్డాయన్నారు. వేలాది మందికి ఉచితంగా విద్యనందించిన ఘనత ఆయనది అని అన్నారు. ఆయన అందించిన సేవలను నాడు భారత ప్రభుత్వం గుర్తించి బాలకృష్ణారెడ్డికి పద్మశ్రీ పురస్కారాన్ని అందించిందని అన్నారు. ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల్లో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు నేడు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉన్నత రంగాల్లో ఉన్నారని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఈ విద్యా సంస్థలను ప్రగతిపథంలోకి తీసుకెళుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

**- 1200 ఓటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటుకు కసరత్తు**

కోట, జులై 15 ప్రభాతవార్త : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అయితే ఎన్నికల వేళ చాంతాడంత వరసల్లో నిలబడి చాలామంది విసిగిపోతుంటారు. అలాకాకుండా ఓటరు ప్రశాంతంగా ఓటు వేసేందుకు అనువైన పరిస్థితులు ప్రభుత్వం కల్పించాలి. ఇందులో భాగంగానే ప్రతి పోలింగ్ కేంద్రానికి 1200 మంది ఓటర్లు ఉండేలా హేతుబద్ధీకరణకు ఎన్నికల సంఘం ఇటీవల స్పష్టం చేసింది. ప్రస్తుతం 1500 మందికి ఒక సెంటర్ ఉండేలా ఏర్పాట్లు ఉన్నాయి. తాజా మార్పులు అమలయ్యేలా యంత్రాంగం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది.

## నెల్లిపూడి సచివాలయం తనిఖీ

వాకాడు, జూలై 15 ప్రభాతవార్త: మండల పరిధిలోని నెల్లిపూడి గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో శ్రీనివాసులు తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులను పరిశీలిస్తూ, విధుల పట్ల ఎటువంటి అలసత్వం లేకుండా ప్రజలతో సత్సంబంధాలు కలిగి, వారి యొక్క పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా ఉండాలని సిబ్బందికి తెలియజేసారు. సచివాలయ సిబ్బంది ఏమైనా అత్యవసర పని నిమిత్తం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే తప్పనిసరిగా అది మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత పంచాయతీ కార్యదర్శికి వివరణ ఇచ్చి వెళ్లాల్సిందిగా సచివాలయ సిబ్బందికి సూచించడం జరిగినది. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్న, మహిళా పోలీస్ అమరావతి పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ భూములను పరిశీలించిన సిఐడి అధికారులు



దొరవారి సత్రం జులై 15 ప్రభాతవార్త : దొరవారిసత్రం మండలం ప్రభుత్వ ఆధీనం ఉన్న అగ్రిగోల్డ్ భూములను మంగళవారం తిరుపతి సిఐడి అధికారులు పరిశీలించారు డివి సత్రం మండలం పరిధిలోని అక్కర పాక గ్రామం ఉన్న అగ్రిగోల్డ్‌ను రెవెన్యూ సూళ్లూరుపేట సబ్ రిజిస్టర్ సహాయంతో ఆ భూములను ఆరాధించారు అనంతరం అగ్రిగోల్డ్ భూములను స్థితిగతులను వాటి వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు సిఐడి పాటు పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యతో ఉపాధి అవకాశాలు



తిరుపతి విద్య, జూలై 15 ప్రభాతవార్త : స్థానిక యస్వీయూనివర్శిటీ భౌతిక శాస్త్ర విభాగమునందు యాగ్నం యూనివర్శిటీ, సీత్ కొరియాలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వాసుదేవరెడ్డి సందర్శించి విద్యార్థులకు ఎమ్ప్లాయిమెంట్ అండ్ ఎడ్యుకేషన్ మీద గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతవిద్య తరువాత ఉపాధి అవకశాలు ద్వారా మెరుగుపరుచు కోవాలని ప్రస్తుత విద్యా వ్యవస్థ ద్వారా విదేశాల లో పుష్కలంగా ఆవకశాలు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ ఉన్నత విద్య ప్రవేశపెట్టిన సిలబస్ ప్రకారం విద్యార్థులు అన్ని సబ్జెక్టుల యందు నాలెడ్జి పొందవచ్చని దీని ద్వారా భారతదేశంలోనే గాక విదేశాలలో డిమాండ్ ఏర్పడనుందని వివరించారు. ప్రతిరోజు ప్రొఫెసర్స్ చెప్పే పాఠాలతోపాటు నెట్, గౌట్, జెస్ట్ వంటి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలని తెలియజేశారు. యంఎస్సీ ఫిజిక్స్ చేసే విద్యార్థలకు ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో వివరించారు. యూనివర్శిటాలో వున్న అన్ని సదుపాయాలను విద్యార్థులు చక్కగా వినియోగించుకొని కొరియాలో మంచి భవిష్యత్తుతో ముందుకు సాగాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ వ్యాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాద్ రాజు, అకడమిక్ కన్సల్టెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు పుష్పపల్లకీ



తిరుమల. జూలై 15ప్రభాతవార్తప్రతినిధి: ఆణివార ఆస్థానం సందర్భంగా నేటి సాయంత్రం తిరుమలలో మలయప్పస్వామి పుష్పపల్లకిపై ఊరేగుతారు. ఇందుకోసం దేశీయవిదేశీ పుష్పాలను, కట్‌ఫ్లవర్స్‌ను, దాతల సహకారంతో నాలుగు టన్నులు తెప్పించారు.

## పాదాలమండపం ఆలయంలో ఆలయ శుద్ధి



తిరుపతి, జూలై 15ప్రభాతవార్త: అలిపిరి వద్ద ఉన్న పాదాలమండపం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేడుకగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. మంగళవారం ఉదయం పాదాలమండపంలోని ఆండాల్ అమ్మవారి (గోదాదేవి) సన్నిధి నుండిలక్ష్మీ నారాయణ స్వామి సన్నిధి వరకు సుగరధపరిమళ జలంతో ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు.

## దీప నైవేద్యాలకు నోచుకోని శివాలయం



శ్రీకాళహస్తి, జూలై 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న విజ్ఞాన గిరి అభివృద్ధికి దేవస్థానం కోట్లు వెచ్చిస్తున్నారు. కొండ అంతా తొలచి గర్భగుడి పరిసరాలు విస్తృత పరచారు. కొత్త భవనంలో ఈ ఏడాది భక్తులు కుమారస్వామిని కొండకు దిగువన దక్షిణం వైపు ఓ చిన్న శివాలయం నిర్మించి ఉన్నారు. సుమారు పది సంవత్సరాల క్రితం ఈ పాడుబడ్డ ఆలయానికి కొత్త ఆలయాన్ని దేవస్థానం నిర్మించారు. అంతేకాక విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. గత కొంత కాలంగా ఈ ఆలయానికి సంబంధించి పట్టించుకోటం లేదనే అసంతృప్తి చుట్టుపక్కల వారిలో చోటు చేసుకుంది. శివయ్య చిమ్మచీకటిలో బిక్కుబిక్కు మంటూ భక్తులకు దర్శన మిస్తున్నారు. అయితే ఈ దీనావస్థను గుర్తించిన పొరుగున నివాసముంటున్న ఓ భక్తురాలు తన ఇంటి నుంచి ఓ దీపపు బుడ్డీని వెలిగిస్తున్నారు.

## 600 మంది విద్యార్థులు...20 బాత్‌రూంలు

**-గిరిజన గురుకులాన్ని తనిఖీ చేసిన బృందమ్మ**



తొట్టంబేడు, జూలై 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని బాలుర గిరిజన గురుకులాన్ని మంగళవారం బొజ్జల బృందమ్మ తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులతో కలసి తనిఖీ చేసారు. ఇక్కడ 600 మంది విద్యార్థులు చదువు కుంటున్నారు. కానీ వారికి తగినకనీస సదుపాయాల్లేదు. మంత్రి జూమ్ సమా వేశంలో మంగళవారం పలు సమస్యల గురించి ప్రస్తావించినట్లు తెలిసింది. కానీ ఇక్కడి నిర్వాహకులు సమస్యలను ఎందుకో వివరించలేకపోయినట్లు సమాచారం. అయితే బృందమ్మ తనిఖీ చేసినపుడు పలు సమస్యలను గుర్తించారు. వాటిపై శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దృష్టికి తెచ్చి పరిష్కరించుటకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఆమె గుర్తించిన సమస్యలను పరిశీలిస్తే 600 మంది విద్యార్థులకు 20 బాత్‌రూంలు, 20 లెట్రిన్లు మాత్రమే ఉన్నాయి. ఏక కాలంలో ఉదయం స్నానాలు ఎలా చేయగలరు? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆమెతో పాటు సుమతి, మల్లిశ్వరి, కన్నలి ప్రతాప్‌రెడ్డి, విజయకుమార్, బాబురెడ్డి తదితరులున్నారు.

## ఘనంగా పచ్చిగెరిగ ఊరేగింపు



రామకుప్పం, జూలై 15 ప్రభాతవార్త : స్థానికంగా వెలసిన శ్రీ గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం పచ్చిగెరిగ కార్యక్రమాన్ని నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారి శిరస్సును వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పుర వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం అగ్నిగుండ కార్యక్రమం ఏర్పాటుచేశారు. మొక్కులు కలిగిన భక్తులు గుండంలో దిగి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా సజ్జల చెంగారెడ్డి కుటుంబీకులు వ్యవహరించారు.

## తెలుగు బహుజన పార్టీకి షోకాజ్ నోటీసు జారీ

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్**

తిరుపతి కలెక్టరేట్, జూలై 15 ప్రభాతవార్త : జిల్లాలో 2019 నుంచి గత ఆరు ఏళ్ళల్లో కనీసం ఒక ఎన్నికల్లో కూడా పోటీ చేయని రిజిష్టర్ చేయబడని గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు భారత ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులను జారీ చేసిందని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గూడూరు మిట్ట పాలెం వీధిలోని తెలుగు బహుజన పార్టీకి షోకాజు నోటీసు వచ్చినట్లు తెలిపారు. ఈ నోటీసులో ఆ పార్టీ అధ్యక్షులు కానీ, కార్యదర్శి కాని ఈనెల 16వ తేదిలోగా ప్రధాన ఎన్నికల అధికారికి అన్నీ రకాల ఆధార పత్రాలతో రాత పూర్వకంగా వివరణ లేక అందజేయాల్సి ఉంటుందన్నారు. వెలగపూడి, రాష్ట్ర సచివాలయం 5వ బ్లాక్‌లో ప్రధాన ఎన్నికల అధికారి ఎదుట ఈనెల 21 లోపు హాజరు కావాలని సూచించారు.

## పిఎసిఎస్ సభ్యులుగా పనబాక



కోట, జులై 15 ప్రభాతవార్త : కోట మండలం తిన్నెలపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం అధ్యక్షులుగా పలగాటి భాస్కర్‌రెడ్డి, సభ్యులుగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, పుచ్చలపల్లి చిరంజీవిలను ప్రభుత్వం నియమించింది. వీరి నియామకం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కొత్తపాళెం సొసైటీ చైర్మన్‌గా రవీంద్రనాద్‌రెడ్డి



కోట, జూలై 15 ప్రభాతవార్త : కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం సహకార వ్యవసాయ పరపతి సంఘం (పిఏసిఎస్) చైర్మన్‌గా జరుగుమల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సినయర్ నాయకులు ఉచ్చూరు రవీంద్రనాద్ రెడ్డి ప్రభుత్వం నియమిచింది. రవీంధ్రనాద్‌రెడ్డి గూడూరు శాసన సభ్యులకు పాశం సునిల్ కుమార్‌కు ముఖ్య అనుచరులగా ఉంటున్నారు. ఎన్నికలకు ముందు శాసన సభ్యులు గెలుపునకు విశేషంగా కృషి చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు తమ సంఘం నుంచి రుణాలును విరివిగా మంజారు చేయిస్తానాని చెప్పారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన శాసన సభ్యులు డా.పాశం సునిల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పేదవారిని అభివృద్ధి చేసేందుకే పి4



నాయుడుపేట, జూలై 15 ప్రభాతవార్త: గ్రామాల్లో పేదప్రజలను గుర్తించి వారిని అన్నివిధాల అభివృద్ధి సేచేందుకే ప్రభుత్వం నూతనంగా పి4 విధానాన్ని తీసుకువచ్చిందని నాయుడుపేట ఎంపిడిఓ సురేష్ బాబు అన్నారు. మండలంలోని కల్లిపేడు, కాపు లూరు గ్రామాల్లో మంగళవారం ఆయన ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన పి4విదానం ద్వార గ్రామాల్లో నిరుపేదలను గుర్తించి వారికి కావల్సిన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఎన్ఆర్ఐలు, ప్రారిశ్రామిక వేత్తలు గ్రామాలను దత్తత తీసుకొని వారికి ఉద్యోగం, ఇళ్ళు, తదితర సౌకర్యాలు కల్పించి అభివృద్ధిచేయడం జరుగుతుందన్నారు. కల్లిపడులో 150మందిని కాపులూరులో, 170మంది నిరుపేద ప్రజలను గుర్తించినట్లు గ్రామసభలో తెలిపారు. వీరిని ప్రభుత్వం చేపడుతున్న పి4ద్వార అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో డిఎల్‌డిఓ జాలిరెడ్డి, పంచాయితీ కార్యదర్శిలు గోపాల్, గోవిందయ్య, వివిధశాఖల అధికారులు, ప్రజలు పాల్గోన్నారు.

## బిఎల్‌ఓకు ప్రత్యేక సమావేశం

దొరవారిసత్రం, జులై 15 ప్రభాతవార్త : దొరవారిసత్రం మండలం పరిధిలోని ఉన్న సర్వసభ్య సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ బిఎల్ఓ లకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా తాసిల్దార్ శైలకుమారి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును నమోదు చేయాలని సూచించారు వీరితో పాటు అధికారులు పాల్గొన్నారు

## నూతనంగా ఎంపికైన సొసైటీ చైర్మన్‌లు



గూడూరు, జూలై 15 ప్రభాతవార్త : నియోజకవర్గంలో ఉన్న సొసైటీ చైర్మన్లు ఎంపిక చేయడం జరిగింది. అందులో భాగంగా గూడూరు 24 సొసైటీ చైర్మన్ అల్లూరు కరుణాకర్‌రెడ్డి, చిల్లకూరు మండ లంలోని తిప్పకుంటపాలెం పిఎసిఎస్ చైర్మన్ దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, భోదనం పిఎసిఎస్ చైర్మన్‌గా ప్రవీణ్ కుమార్ రెడ్డి, అదేవిధంగా కోట మండలంలోని ఊనుగుంటపాలెం పిఎసిఎస్ చైర్మన్‌గా నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి, చిట్టేడు పిఎసిఎస్ చైర్మన్‌గా చాపల శ్రీనివాసులు, వాకాడు పిఎసిఎస్ చైర్మన్ లక్ష్మి ప్రసాద్‌రెడ్డి, చిట్టమూరు పిఎసిఎస్ చైర్మన్‌గా గుండుబోయిన కస్తూరియ్యా, మల్లం పిఎసిఎస్ రామిశెట్టి హరినాథ్ చేసినట్లు పార్టీ ప్రకటన విడుదల చేయడం హర్షం వ్యక్తం చేశారు.

## ఎన్.బి.కె.ఆర్‌కు ఘనంగా జ్యోతి డే



వాకాడు, జూలై 15 ప్రభాతవార్త: వాకాడులోని ఎన్.బి.కె.ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు పద్మశ్రీ దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి 90వ జ్యోతి డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. నేదురుమల్లి కళాక్షేత్రంలో పార్క్‌లో ఉన్న దివంగత విద్యా ప్రదాత, పద్మశ్రీ బాలకృష్ణ రెడ్డి తనయుడు నేదురుమల్లి హిమ కుమార్‌రెడ్డి, కొడవలూరు దామోదర్‌రెడ్డిలు, బాలకృష్ణారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దామోదర్ రెడ్డి మాట్లాడుతూ విద్యా సంస్థలకు బీజం వేసిన రోజును జ్యోతి డేగా ప్రతి సంవత్సరం జులై 15 తేదీన జరుపుకోవడం జరుగుతుంది అని తెలిపారు. పూరిగుడిసెలో రాత్రి పూట పాఠశాలతో ప్రారంభమై అంచెలంచెలుగా ఎదిగి కళాశాలలుగా వెలిచాయి అని తెలియజేసారు. వేలాదిమందికి ఉచితంగా విద్య అందించిన ఘనత ఆయనదే అని అన్నారు. విద్యాసంస్థలు దినదిన అభివృద్ధి చెందడానికి, నాణ్యమైన విద్య అందించడంలో కళశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పిడుగు ప్రవీణ్, ప్రభు చరణ్, భోదన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# కుమారస్వామి దర్శనానికి విస్తృత ఏర్పాట్లు





శ్రీకాళహస్తి, జూలై 15 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో జరుగనున్న ఆడికృత్తిక మహోత్సవాల్లో శనివారం భరణి ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా ఆలయానికి మొక్కులు తీర్చుకోవటానికి వచ్చే భక్తులు ఒక్కరు కూడా తమకు దర్శనం బాగా జరగలేదనే అసంతృప్తి లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి తన సిబ్బందికి సూచించారు. ఆడికృత్తిక సందర్భంగా ఇఓ విధుల నిర్వహణకు నియమించిన సిబ్బందితో చర్చించారు. ఆడికృత్తిక ఉత్సవాలు ఎంతో కీలకమైనవని ఆయన గుర్తించారు. ఇక్కడి ఉత్సవాల పర్యవేక్షణకు ఎఇఓ హేమా మాలినిని నియమించారు. ఆమెకు సహాయకులుగా చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, సూపరింటెండెంట్ రవిని నియమించారు. ఈ సందర్భంగా మంగళవారం ఇఓ బాపిరెడ్డి తన సిబ్బందితో పాటు అర్బన్ సిఐ డి.గోపితో పరిశీలించారు. ట్రాఫిక్ ఏర్పాట్లకు సంబంధించి సిఐ డి.గోపితో ఇఓ ప్రత్యేకంగా సమీక్షించారు. ఇక ఆలయంలో విఐపిల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆడికృత్తిక సందర్భంగా నారదపుష్కరిణిలో ఏర్పాట్లను ఇఓ డి.బాపిరెడ్డి మంగళవారం డిఇఇ శ్రీనివాసు లురెడ్డి, ఎఇఓ హేమామాలిని, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, అర్బన్ సిఐ డి.గోపిలతో కలసి పరిశీలించారు. ఇక్కడ కోనేరులో నీరు లోతుగా ఉండటంతో భకక్తు దిగి స్నానం చేయటానికి ఇబ్బంది ఉంటుంది. అంతేకాకుండా ప్రమాదం. కాబట్టి ప్రత్యేంగా నాలుగువైపులా కొళాయిలు ప్రత్యేక స్నానపు గదులు ఏర్పాటు చేసినట్లు ఇంజనీరింగ్ విభాగం వివరించారు. అంతేకాక అభిషేకాలు జరుగుతుంటే దర్శనం భక్తులు లఘు దర్శనంతో వెళ్ళాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులతో సహకరించాలని సూచించారు.

## శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం!



రేణిగుంట జూలై 15 ప్రభాతవార్త : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన శక్తి (ఎస్ఓఎస్) మొబైల్ యాప్ మహిళలకు రక్షణ కవచం అని రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు అన్నారు. రేణిగుంట బాలికల ప్లస్ టు ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ అధికారి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా ఓల్డ్ యూత్ స్కిల్స్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శక్తి మొబైల్ యాప్, గంజాయి తదితర మత్తు పదార్థాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. విద్యార్థులకు సమాజ శ్రేయస్సుకు సంబంధించిన వివిధ రకాల పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ మహిళలందరికీ మనోధైర్యంతో పాటు స్వీయ సంరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. మహిళలు తమ మొబైల్ తో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితిలో యాప్ లోని సాస్ బటన్ నొక్కితే పోలీసులు తక్షణం స్పందించి రక్షణ కల్పిస్తారన్నారు. యాప్ లో ఉన్న సేఫ్ ట్రావెల్ ఆప్షన్ ద్వారా మహిళల ప్రయాణాలపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అలాంటి వాటిపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర, ఏఎస్ఐ పార్వతి, పాఠశాల ప్రధానాచార్యులు శ్యామల, ఉపాధ్యాయులు పద్మ, ఉషశ్రీ, మోహన్ నాయుడు, స్రవంతి, శోభ, రాధా తదితరులు పాల్గొన్నారు.

## రుణాలతో ఆర్థికంగా ముందడుగు : కలెక్టర్



చిత్తూరు, జులై 15 ప్రభాతవార్త: స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ డిఆర్‌డిఎ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ డిఆర్‌డిఎ ద్వారా అమలు అవుతున్న పథకాల అమలుపై, మైక్రో ప్లానింగ్ అప్రూవల్ కోసం డిపిఎంలు, ఎపిఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సంఘాల ద్వారా రుణాలు పొందిన మహిళలు తిరిగి చెల్లించేలా క్షేత్ర స్థాయిలో పూర్తిగా పరిశీలించి రికవరీపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది తిరిగి చెల్లించని వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు సంఘ సభ్యుల నగదును బ్యాంకుల్లో డిపాజిట్ చేయాలన్నారు. ఈ విషయంలో డిపిఎంలు, ఎపిఎంలు క్షేత్ర స్థాయిలో అవగాహన పెంచి సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, డిపిఎంలు, ఎపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యోగుల సహకారంతో...**

## తెలుగుగంగ శాఖకు మంచి పేరు తీసుకువస్తా

**-నూతన ఎస్ఈ రాధాకృష్ణమూర్తి**



తిరుపతి(రవాణ), జూలై 15ప్రభాతవార్త: సహచర ఉద్యోగుల సహాకారంతో తెలుగుగంగశాఖకు, రాష్ట్రప్రభుత్వానికి మంచిపేరు తీసుకువచ్చేలా పనిచేస్తాం ని తెలుగుగంగప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ రాధాకృష్ణమూర్తి తెలిపారు. వెంకటగిరి ఈఈగా పనిచేస్తూ పదోన్నతిపై తిరుపతి తెలుగుగంగప్రాజెక్టు ఎస్ఈగా బాధ్యతలు చేపట్టారు. సుదీర్ఘకాలంగా ఆయన తెలుగుగంగ ప్రాజెక్టులోనే విధులు నిర్వహిస్తున్నారు. అంకితభావం, చిత్తశుద్ది విధి నిర్వహణకు తార్కాణంగా రాష్ట్రమంత్రులు, రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో అధికారులు, కలెక్టర్ల నుండి సమీక్షా సమావేశాల్లో ఆయన చేపట్టిన తెలుగుగంగ ప్రాజక్టు సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై ఎంతో అవగాహన ఉంది. తిరుపతిలో బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణ మూర్తిని తిరుపతి జిల్లా రాపూరు ఇఇ రవిశంకర్‌రెడ్డి, వెంకటగిరి మైనర్ ఇరిగేషన్ ఇఇ బాబురెడ్డి, రేణిగుంట ఇఇ వెంకటరాజు, తిరుపతి ఇరిగేషన్ ఇఇ ప్రసాద్, శ్రీకాళహస్తి టిజిపి ఇఇ సుబ్బరత్నారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఇఇ శివారెడ్డి, డిఎస్పీ తిరుపతి హరిబాబు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్రనీటిపారుదలశాఖ మంత్రి నిమ్మలరామానాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయి : భక్తుల సంతృప్తి



తిరుమల, జూలై 15ప్రభాతవార్తప్రతినిధి: భక్తులకు కొండపై టిటిడి కల్పిస్తున్న వసతి, అన్నప్రసాదాలు, దర్శనం వంటి సౌకర్యాలు ఎలా ఉన్నాయని సామాన్య భక్తులను తానూ ఓ భక్తుడిగా మారి చైర్మన్ బిఆర్‌నాయుడు సమాధానాలు రాబట్టారు. మంగళవారం సాయంత్రం సహస్రదీపాలంకారసేవ అనంతరం ఆయన బోర్డు సభ్యులు సనబాకలక్ష్మి, శాంతారాం, నరేశ్, జానకిదేవిలతో కలసి ఆలయం ముందు, అన్నదానం భవనం ప్రాంతాల్లో భక్తులతో మమేకమ య్యారు. తాగునీరు శుభ్రత, అన్నప్రసాదాలు రుచి, క్యూలైన్లలో సక్రమంగా అందుతున్నాయా అని భక్తులను అడిగి తెలుసుకున్నారు. తిరుమలలో మెరుగుపడిన సదుపాయాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయం ముందు గజరాజుల ఆశీర్వాదం తీసుకున్నారు.

## తమది హామీలు నెరవేర్చే ప్రభుత్వం : ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



పుత్తూరు (నగరి), జూలై 15 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. సుపరిపాలన, తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గేట్‌పుత్తూరులోని ఆరో వార్డులో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను నెరవేరుస్తూ ప్రజా సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డి.ఎన్.ఏలుమలై (అమ్ములు), డి.ఎస్.గణేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రిస్కిప్షన్ లేకుండా మాత్రలు విక్రయిస్తే చర్యలు తప్పవు

పుత్తూరు రూరల్, జూలై 15 ప్రభాతవార్త: మెడికల్ షాపు యజమానులు డాక్టర్ల ప్రిస్కిప్షన్ లేకుండా మాత్రలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తిరుపతి జిల్లా డ్రగ్స్ అధికారిణి రీతు హెచ్చరించారు. పట్టణంలోని మెడికల్ సాపులో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తునిచ్చే మాత్రలు అమ్మినా, కాలం చెల్లిన మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు సలహా మేరకు మందులు తీసుకోవాలని కొనుగోలు దారులకు సూచించారు. మందులు కొనుగోలు చేసిన వారికి తప్పకుండా బిల్లు ఇవ్వాలని తెలిపారు.